**విలేకరులు కావలెను**

**తొలివెలుగు** జాతీయపత్రికలో పనిచేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతుంది.

**సంప్రదించాల్సిన చిరునామా..**

**సెల్ : 9491134365**



TGTEL/26/A6221

# తొలివెలుగు

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం.. **జాతీయపత్రిక**

| యాదాద్రి భువనగిరి | సంపుటి: 01 | సంచిక : 86 | శనివారం | 24-10-2026 | ఎడిటర్: యంజాల ప్రవీణ్ | పేజీలు: 08 | వెల: రూ.2/- |
|---|---|---|---|---|---|---|---|
| Yadadri Bhuvanagiri | Volume:01 | Issue:86 | Saturday | 24-10-2026 | Editor:Yamjala praveen | Pages:08 | Cost:2/- |


## ఉత్తరాంధ్ర వైపు దూసుకొస్తున్న 'ఆర్నాబ్' తుపాను.

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడి తుపానుగా మారేందుకు సిద్ధమవుతోంది. ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో ఏర్పడుతున్న ఈ తొలి తుపానుకు 'ఆర్నాబ్' అని పేరు పెట్టనున్నారు. ఇది ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీరాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. శుక్రవారం తూర్పు మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. ఇది శనివారం నాటికి వాయుగుండంగా, ఆదివారానికి తీవ్ర వాయుగుండంగా మారి, సోమవారం (అక్టోబర్ 26) ఉదయానికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తుపానుగా బలపడనుంది. ఆ తర్వాత పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ అక్టోబర్ 27, 28 తేదీల్లో ఉత్తరాంధ్ర-దక్షిణ ఒడిశా తీరాల వైపునకు చేరుతుందని ఐఎండీ అంచనా వేస్తోంది.

# మహారాష్ట్రతో చర్చలకు సిద్ధం కండి

- తుమ్మిడిహట్టి బ్యారేజీపై మహారాష్ట్రతో చర్చలకు సిద్ధం కావాలని ఆదేశం
- బ్యారేజీ ఎత్తు, ముంపు ప్రభావంపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని సూచన
- అక్టోబర్ 23 తర్వాత మహారాష్ట్ర సీఎంతో చర్చలు జరపనున్నట్టు వెల్లడి
- దిండి, అచ్చంపేట ఎత్తిపోతల పథకాల పనులను వేగవంతం చేయాలని ఆదేశాలు
- శ్రీశైలం నుంచి అదనపు నీటిని తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచన



రాష్ట్రంలోని కీలక సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణంపై మహారాష్ట్ర ప్రభుత్వంతో నిర్వహించనున్న చర్చలకు సర్వసన్నద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. రైతుల ప్రయోజనాలే పరమావధిగా ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయాలని ఆయన స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ప్రధానంగా తుమ్మిడిహట్టి, దిండి, అచ్చంపేట ఎత్తిపోతల పథకాలపై చర్చించారు. తుమ్మిడిహట్టి బ్యారేజీని 152 మీటర్ల ఎత్తులో నిర్మిస్తే ఎల్లంపల్లి వరకు నీటిని తరలించే అవకాశం ఉంటుందని, అయితే దీనివల్ల సుమారు 2,300 ఎకరాల మేర ముంపునకు గురవుతుందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అదే 150 మీటర్ల ఎత్తులో నిర్మిస్తే ముంపు వెయ్యి ఎకరాల లోపే మాత్రమే ఉంటుందని తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం, మహారాష్ట్రలో ముంపు ప్రభావాన్ని అంచనా వేస్తూనే, తెలంగాణకు గరిష్ఠంగా నీటి లభ్యత ఉండేలా బ్యారేజీ డిజైన్‌ను రూపొందించాలని సూచించారు. అక్టోబర్ 23 తర్వాత చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు మహారాష్ట్ర ముఖ్యమంత్రి సంకేతాలిచ్చారని రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. ఇటీవల కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆధ్వర్యంలో రెండు రాష్ట్రాల మధ్య జరిగిన సమావేశ వివరాలతో పాటు, సీడబ్ల్యూసీ కోరే ఎలాంటి సమాచారానికైనా సిద్ధంగా ఉండాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

- మిగతా 2వ పేజీలో

## విచ్ఛిన్నకర శక్తులకు వ్యతిరేకంగా సమాజాన్ని ఏకం చేయాలి

- సామాజిక రుగ్మతలు, సవాళ్లను పరిష్కరించుకోవాలి
- పౌరులను స్వావలంబన వైపు నడిపించాలి
- ప్రధానమంత్రి మోదీ పిలుపు
- 'చిన్మయ అమృత్ మహోత్సవ్ గ్లోబల్ సమ్మేళన్'ప్రారంభం



## మహా నిరసనకు ఫ్రాన్స్ సిద్ధం!

- శనివారం భారీ ఆందోళనలకు పిలుపు
- హింసను సహించబోమని ప్రభుత్వం స్పష్టీకరణ
- 70 వేల మంది సిబ్బంది మోహరింపు
- పలు మ్యూజియమ్‌ల మూసివేత



2లో

## ముగిసిన చంద్రబాబు, పవన్

# కీలక సమావేశం

- చంద్రబాబు నివాసంలో జరిగిన సమావేశం
- స్థానిక సంస్థల ఎన్నికలపై సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో చర్చలు
- రెబల్స్ సమస్యను పరిష్కరించి, సమన్వయంతో ముందుకెళ్లాలని నిర్ణయం





ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భేటీ ముగిసింది. సీఎం నివాసంలో సుమారు అరగంట పాటు సాగిన ఈ భేటీలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో తలెత్తిన తాజా రాజకీయ పరిణామాలపై ఇరువురు నేతలు ప్రధానంగా చర్చించారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియపై

- మిగతా 2వ పేజీలో

### రేపు ఢిల్లీకి వెళుతున్న చంద్రబాబు

- ఒక్క రోజు ఢిల్లీ పర్యటనకు చంద్రబాబు
- రేపు అర్ధరాత్రికి మళ్లీ అమరావతికి చేరుకోనున్న సీఎం
- కేంద్ర పెద్దలను కలిసే అవకాశం

2లో



## దేశ రాజకీయాల్లో కేసీఆర్ చక్రం తిప్పే రోజులు వస్తున్నాయి

- దేశ రాజకీయాల్లో కేసీఆర్ కీలకమయ్యే రోజులు వస్తున్నాయని వ్యాఖ్య
- రేవంత్ రెడ్డి పాలన తాత్కాలికమేనని, త్వరలో కేసీఆర్ సీఎం అవుతారని ధీమా
- కాంగ్రెస్, బీజేపీయేతర కూటమి దేశంలో కీలకపాత్ర పోషిస్తుందని జోస్యం
- కరెంట్ కోతలతో రైతులు ఇబ్బంది పడుతున్నారని ప్రభుత్వంపై విమర్శలు
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు యువత తగిన గుణపాఠం చెబుతుందన్న కేటీఆర్

దేశ రాజకీయాల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కీలక పాత్ర పోషించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని, ఆయన జాతీయ స్థాయిలో చక్రం తిప్పే సమయం ఆసన్నమైందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వ హడావిడి కొద్దిరోజులు మాత్రమేనని, ఆ తర్వాత మళ్లీ కేసీఆరే ముఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన అంబర్‌పేట నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య నేతల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని కేటీఆర్ ఆరోపించారు. తీవ్రమైన విద్యుత్ కోతల వల్ల రైతులు అల్లాడుతున్నారని,

- మిగతా 2వ పేజీలో

## రేకుల షెడ్డు కింద చదువులు.. స్పందించిన మంత్రి లోకేశ్

- అల్లూరి జిల్లాలో రేకుల షెడ్డు కింద విద్యార్థుల చదువులు
- డూంబ్రిగూడ మండలానికి చెందిన వీడియో సోషల్ మీడియాలో వైరల్
- పాఠశాల భవనాన్ని తక్షణమే బాగుచేయాలని అధికారులకు ఆదేశం

అల్లూరి సీతారామరాజు జిల్లాలో పాఠశాల భవనం లేక విద్యార్థులు రేకుల షెడ్డు కింద చదువుకుంటున్న దుస్థితిపై విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించారు. పాఠశాల భవనానికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.వివరాల్లోకి వెళితే, అల్లూరి సీతారామరాజు జిల్లా డూంబ్రిగూడ మండలంలోని ఓ పాఠశాలలో సరైన భవన సదుపాయం లేదు. దీంతో అక్కడి విద్యార్థులు



2లో



## ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు

- నామినేషన్ కేంద్రాల్లో వైసీపీ అభ్యర్థులపై దాడులు చేశారన్న జగన్
- వైసీపీ నేతలను గృహ నిర్బంధం చేస్తున్నారని మండిపాటు
- సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత కూడా ప్రభుత్వ వైఖరిలో మార్పు రాలేదని విమర్శ

ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని వైసీపీ అధినేత జగన్ ఆరోపించారు. రాష్ట్రంలో రావణకాసుర పాలన నడుస్తోందని ఆయన మండిపడ్డారు. నామినేషన్ కేంద్రాల వద్ద వైసీపీ అభ్యర్థులపై దాడులు చేసి, వారి

## నెలాఖరులోగా లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలి

- ఇందిరమ్మ టవర్ల నిర్మాణంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక ఆదేశాలు
- హైదరాబాద్‌లో ఇందిరమ్మ టవర్ల కోసం యుద్ధప్రాతిపదికన భూములు గుర్తించాలని ఆదేశం
- మూడు దశల్లో లక్ష ఫ్లాట్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం
- లాటరీ ప్రక్రియను యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేసి పారదర్శకత పాటించాలని స్పష్టం
- లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ఛార్జీలు లేకుండా పూర్తి హక్కులు కల్పించనున్న సర్కార్



## దేశ రాజకీయాల్లో కేసీఆర్ చక్రం తిప్పే రోజులు వస్తున్నాయి

వారి కష్టాలను పట్టించుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. ఎల్‌నినో ప్రభావంపై నిపుణులు పది నెలల ముందే హెచ్చరించినప్పటికీ, ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టడంలో విఫలమైందని మండిపడ్డారు. కాంగ్రెస్ హామీలను నమ్మి మోసపోయిన అన్ని వర్గాల ప్రజలు ఇప్పుడు మళ్లీ బీఆర్ఎస్ వైపే చూస్తున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి హడావిడి మరికొద్దిరోజులు మాత్రమే ఉంటుందని కేటీఆర్ పేర్కొన్నారు. జాతీయ రాజకీయాల గురించి ప్రస్తావిస్తూ, భవిష్యత్తులో కాంగ్రెస్, బీజేపీయేతర పార్టీలే దేశంలో నిర్ణయాత్మక పాత్ర పోషిస్తాయని కేటీఆర్ జోస్యం చెప్పారు. రాహుల్ గాంధీ ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆశించిన ఫలితం ఉండదని, అటు ప్రధాని మోదీ పాలనలోనూ దేశానికి చేకూరిన ప్రయోజనం ఏమీ లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం తెలంగాణ నుంచి గెలిచిన ఎంపీలెవరూ పార్లమెంటులో గళం విప్పడం లేదని ఆయన దుయ్యబట్టారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు యువత తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యాల వల్లే నేడు యువత రోడ్లపైకి వచ్చి పోరాటాలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతలు రాష్ట్ర అభివృద్ధిని విస్మరించి, కేవలం ప్రతిపక్షాలను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని ఆయన ఆరోపించారు.

## ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు

నామినేషన్ పత్రాలను చించివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీ నేతలను పోలీసులు గృహ నిర్బంధం చేయడం, పోలీస్ స్టేషన్లకు పిలిపించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ అక్రమాలపై తాము ఆధారాలు సేకరించి రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ), గవర్నర్‌తో పాటు సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించామని తెలిపారు. తమ పిటిషన్‌పై స్పందించిన సుప్రీంకోర్టు, అభ్యర్థుల తుది జాబితా ప్రకటనను అక్టోబర్ 25 వరకు వాయిదా వేయాలని, నామినేషన్ల దాఖలుకు స్వేచ్ఛ కల్పించాలని, అభ్యర్థులకు రక్షణ, సీసీటీవీ రికార్డింగ్ ఏర్పాటు చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని జగన్ గుర్తుచేశారు. అయినప్పటికీ ప్రభుత్వ యంత్రాంగం వైఖరిలో ఎలాంటి మార్పు రాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 19 మున్సిపాలిటీలలో తమ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని, కానీ ఎస్ఈసీ కేవలం పరిమిత సంఖ్యలో కొన్ని చోట్ల మాత్రమే రీ-నామినేషన్లకు అవకాశం ఇచ్చిందని జగన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏకపక్ష విజయాల కోసం చంద్రబాబు నిబంధనలు మార్చుతున్నారని, ఇది మహాభారతంలోని మాయాజూదాన్ని తలపిస్తోందని ఆయన విమర్శించారు.

## విచ్ఛిన్నకర శక్తులకు వ్యతిరేకంగా సమాజాన్ని ఏకం చేయాలి

న్యూఢిల్లీ: దేశంలో అనేక దశాబ్దాలుగా పలు సవాళ్లు, సామాజిక రుగ్మతలు కొనసాగుతున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. వాటిని పరిష్కరించుకోవడానికి, విచ్ఛిన్నకర శక్తులకు వ్యతిరేకంగా సమాజాన్ని ఏకం చేయడానికి, పౌరులను స్వావలంబన వైపు నడిపించడానికి సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం ఢిల్లీలో 'చిన్మయ అమృత్ మహోత్సవ్ గ్లోబల్ సమ్మేళన్'ను ప్రధానమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత 25 ఏళ్లుగా ప్రభుత్వ అధినేతగా తన శక్తిమేర దేశానికి సేవలు అందించానని పేర్కొన్నారు. చిన్మయ మిషన్ అందిస్తున్న సేవలను ప్రశంసించారు. ఇది ఒక సంస్థ మాత్రమే కాదని, ఒక ఆలోచనా విధానమని వివరించారు. 'చిన్మయ'అంటే 'శుద్ధ చైతన్యం'అని తెలియజేశారు. చిన్మయ మిషన్ వ్యవస్థాపకుడు స్వామి చిన్మయానంద దశాబ్దాల ప్రయాణం దైవిక సంకల్పంతో కూడుకున్నదని మోదీ చెప్పారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో స్వామి చిన్మయానంద వంటి దూరదృష్టి కలిగిన మహనీయులు ఎన్నో కలలు కన్నారని, వాటిని నెరవేర్చడానికి మనం కృషి చేస్తున్నామని ఉద్ఘాటించారు. దశాబ్దాలుగా కాలం ఎంతో మారిందని, కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయని, సమాజంలో కొత్త రుగ్మతలు తలెత్తుతున్నాయని ప్రధానమంత్రి వెల్లడించారు. నేడు వీటిని పరిష్కరించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని తేల్చిచెప్పారు. సమాజాన్ని విచ్ఛిన్నం చేసే శక్తులకు వ్యతిరేకంగా మనం ఐక్యంగా నిలవాలని సూచించారు. పౌరులను స్వయం సమృద్ధి దిశగా ప్రోత్సహించాలని, ప్రతి ఒక్కరినీ '2047 నాటికి వికసిత భారత్'అనే లక్ష్యంతో అనుసంధానించాలని స్పష్టంచేశారు. ఈ లక్ష్యాలను సాధించేందుకు మనం మరింత చొరవ చూపాలని, కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. భారతదేశం నుంచి చోరీకి గురైన సాంస్కృతిక కళాఖండాలను తిరిగి తీసుకొచ్చేందుకు ఎనలేని కృషి చేస్తున్నామని మోదీ ప్రస్తావించారు. గతంలో లెక్కలేనన్ని అమూల్యమైన విగ్రహాలను విదేశాలకు తరలించారని, వాటి గురించి ఎవరూ ప్రశ్నించకూడదన్న ఉద్దేశంతో ఇతరులకు అమ్మేశారని చెప్పారు. ఆ విగ్రహాలను పూజించే సంగతి అటుంచితే, కనీసం వాటి గురించి ఆరా తీసేవారు కూడా ఎవరూ లేకుండాపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. వాటిని తిరిగి తీసుకురావాలన్న ఆలోచన గతంలో ఎవరూ చేయలేదన్నారు. మన దేశం నుంచి విదేశాలకు అక్రమంగా తరలించుకుపోయిన 650కి పైగా పురాతన విగ్రహాలను గత 12 ఏళ్లలో తాము తిరిగి తీసుకొచ్చామనితెలియజేశారు. 'చిన్మయ అమృత్ మహోత్సవ్'లో యువత పోషించిన పాత్ర పట్ల ప్రధానమంత్రి హర్షం వ్యక్తం చేశారు. వారిలో చాలామంది సుమారు 300 రోజుల పాటు దాదాపు 40,000 కిలోమీటర్లు ప్రయాణించి, లక్ష మందికి పైగా యువతకు చేరువయ్యారని చెప్పారు. 2047లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 100 ఏళ్లు పూర్తయ్యే నాటికి, చిన్మయ మిషన్ కూడా తన శతాబ్ది ఉత్సవాలను నిర్వహించుకోనుందని పేర్కొన్నారు. చిన్మయ మిషన్ శతాబ్ది యాత్ర, వికసిత్ భారత్ యాత్ర రెండూ కలిసే ముందుకు సాగుతాయని వ్యాఖ్యానించారు. మన లక్ష్యాలు ఒక్కటే, మన ఆశయాలు ఒక్కటే కాబటి మనం కలిసి ప్రయాణం సాగించాలని కోరారు. 3డీ హోలోగ్రాఫిక్ డిజిటల్ మానవ రూపంలో ఉన్న స్వామి చిన్మయానందతో మోదీ కాసేపు సంభాంచారు. 1993లో స్వామి చిన్మయానందతో తాను సమావేశం కావడాన్ని గుర్తుచేసుకున్నారు.



# మహారాష్ట్రతో చర్చలకు సిద్ధం కండి

దిండి ప్రాజెక్టుకు సంబంధించి ఏదుల రిజర్వాయర్ నుంచి 0.5 టీఎంసీలు, అచ్చంపేట ఎత్తిపోతల పథకానికి 0.1 టీఎంసీల నీటిని తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. శ్రీశైలం నుంచి అదనంగా 0.6 టీఎంసీల నీటిని తీసుకునేందుకు, శ్రీశైలం, నార్లాపూర్ నుంచి ఏదుల రిజర్వాయర్‌కు నీటిని మళ్లించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు.

**జూలై నాటికి కరువు తీవ్రం.**

రాష్ట్రంలో రాబోయే రోజుల్లో కరువు పరిస్థితులు తీవ్రరూపం దాల్చే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, ప్రకృతి విపత్తులు, కరువు పరిస్థితులు, రాజకీయ పరిణామాలు మరియు గత ప్రభుత్వ వైఫల్యాలపై స్పష్టమైన విశ్లేషణ చేశారు. కరువు ప్రారంభంలో చిన్నగా అనిపించినా, జూలై నాటికి తీవ్ర రూపం దాల్చుతుందని, తాగునీటికీ తీవ్ర ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మహారాష్ట్రలోనూ కరువు ప్రభావం ఉందని, అక్కడ కొన్ని ప్రాంతాల్లో రేషన్ షాపుల ద్వారా నీటిని సరఫరా చేస్తున్న పరిస్థితి నెలకొందని తెలిపారు. ఈ సంక్లిష్ట సమయంలో బీఆర్ఎస్ నేతల మాటలను నమ్మి రైతులు ఎవరూ మోసపోవద్దని సీఎం హితవు పలికారు. గతంలో కరోనా సమయంలో కేసీఆర్ 'క్రోసిన్ వేసుకుంటే పోతుంది'



అంటూ బాధ్యతారహితంగా మాట్లాడారని, ఆ మాటలు నమ్మి ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని మండిపడ్డారు. ఇప్పుడు హరీష్ రావు మాటలు నమ్మి పంటలు వేస్తే నష్టపోతారని, హరీష్‌ను నమ్ముకుంటే పరిస్థితి దారుణంగా తయారవుతుందని ఎద్దేవా చేశారు. కరోనా విపత్కర కాలంలో పేదలకు ఉపాధి హామీ పథకమే అండగా నిలిచిందని గుర్తుచేశారు. మోడీ లాగా చప్పట్లు కొట్టండి, దీపాలు పెట్టండి అని తాము చెప్పబోమని, క్షేత్రస్థాయిలో ప్రజలను ఆదుకునేందుకే ప్రాధాన్యత ఇస్తున్నామని స్పష్టం చేశారు. ప్రధాని మోడీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తూ.. ఓటు హక్కు కల్పించిన మంచి ఉద్దేశాన్ని మోడీ తన పార్టీ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని ఆరోపించారు లబ్ది పొందాలని మోడీ ప్రయత్నిస్తున్నారని, ఆయన కుట్రలను రాహుల్ గాంధీ నాయకత్వంలో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌కు ప్రభుత్వాలు ఏర్పాటు చేయడం కొత్త కాదని, కొన్నిసార్లు ఓడిపోయినా రెట్టింపు ఉత్సాహంతో తిరిగొచ్చామని అన్నారు. త్వరలో ఆరు ఉమ్మడి జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నందున పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ ఊహించని విధంగా పెరిగిందని సీఎం తెలిపారు. ఏకంగా 20 వేల మెగావాట్లకు పైగా పీక్ డిమాండ్ నమోదైందని, కష్టమైనా సరే రైతులను ఆదుకోవడానికి విద్యును కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. సోషల్ మీడియాలో కొందరు తమపై విషం చిమ్ముతూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం మూడు నెలల క్రితమే కరువు పరిస్థితులపై అప్రమత్తం చేసిందని, విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, డి. శ్రీధర్ బాబు, సాగునీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ముగిసిన చంద్రబాబు, పవన్ కల్యాణ్ కీలక సమావేశం

సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యతసంతరించుకుంది. కూటమిలోని మూడు పార్టీల (టీడీపీ, జనసేన, బీజేపీ) మధ్య సీట్ల సర్దుబాటు, నామినేషన్ల అనంతరం క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులపై నేతలు సమీక్షించారు. ముఖ్యంగా, పలుచోట్ల రెబల్ అభ్యర్థులు బరిలో ఉండటంతో వారిని బుజ్జగించి, నామినేషన్ల ఉపసంహరణ గడువులోగా పోటీ నుంచి తప్పించేలా చూడాలని నిర్ణయించారు. మిత్రపక్షాలు పూర్తి సమన్వయంతో ముందుకెళ్లాలని, ఎక్కడా ఎలాంటి విభేదాలకు తావివ్వకూడదని ఈ సమావేశంలో దిశానిర్దేశం చేసుకున్నారు. అదేవిధంగా, ఫేక్ వాట్సాప్ గ్రూపుల ద్వారా జరుగుతున్న దుష్ప్రచారంపై కూడా వీరి భేటీలో ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం.

## రేపు ఢిల్లీకి వెళుతున్న చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రేపు ఢిల్లీలో పర్యటించనున్నారు. ఇది కేవలం ఒక్కరోజు పర్యటన మాత్రమే కావడం గమనార్హం. రేపు మధ్యాహ్నం అమరావతి నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయలుదేరి, అక్కడ అధికారిక కార్యక్రమాలు ముగించుకుని అదే రోజు అర్ధరాత్రికి తిరిగి అమరావతి చేరుకుంటారు. ఈ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంలోని పలువురు ముఖ్య నేతలతో భేటీ అయ్యే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. రాష్ట్రానికి సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలు, పెండింగ్ అంశాలు, కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై చర్చించే వీలుంది. అలాగే ఢిల్లీలోని జన్‌పథ్‌లో జరగనున్న ఒక ప్రత్యేక అధికారిక కార్యక్రమంలో ఆయన పాల్గొంటారని తెలుస్తోంది. అయితే, ఢిల్లీ పర్యటనకు సంబంధించిన పూర్తి షెడ్యూల్, ఎవరెవరితో సమావేశమవుతారనే వివరాలు అధికారికంగా వెలువడాల్సి ఉంది.

## రేకుల షెడ్డు కింద చదువులు.. స్పందించిన మంత్రి లోకేశ్

ఓ తాత్కాలిక రేకుల షెడ్డు కింద కూర్చొని చదువుకోవాల్సి వస్తోంది. ఈ హృదయవిదారక దృశ్యాలను ఓ యువకుడు వీడియో తీసి, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ' (గతంలో ట్విట్టర్)లో పోస్ట్ చేశాడు. ఈ వీడియో కొద్ది సమయంలోనే వైరల్‌గా మారి, విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను వెలుగులోకి తెచ్చింది. ఈ పోస్ట్‌పై స్పందించిన మంత్రి నారా లోకేశ్, సరైన సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు పడుతున్న కష్టాలపై ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాల భవనాన్ని తక్షణమే పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో విద్యా మౌలిక సదుపాయాల మెరుగుదలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని స్పష్టం చేశారు. సోషల్ మీడియా ద్వారా తన దృష్టికి వచ్చిన సమస్యపై మంత్రి లోకేశ్ వేగంగా స్పందించి ఆదేశాలు జారీ చేయడం గమనార్హం.

## నెలాఖరులోగా లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలి

హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో ప్రతిపాదించిన ఇందిరమ్మ టవర్ల నిర్మాణం కోసం యుద్ధప్రాతిపదికన భూములను గుర్తించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల కలెక్టర్లతో కలిసి 'క్యూర్' ఇందిరమ్మ టవర్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పథకాల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, క్యూర్ పరిధిలో మూడు దశల్లో మొత్తం లక్ష ఇందిరమ్మ ఫ్లాట్లను నిర్మించనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం కొనసాగుతున్న మొదటి దశతో పాటు, రెండు, మూడవ దశలకు అవసరమైన భూములను త్వరితగతిన సేకరించాలని అధికారులకు సూచించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ఈ నెలాఖరు నాటికి అత్యంత పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపిక కోసం నిర్వహించే లాటరీ ప్రక్రియను యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేయాలని అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. నగరంలోని పేదలకు వారి నివాస ప్రాంతాలకు, ఉపాధి మార్గాలకు సమీపంలోనే గృహ వసతి కల్పించాలనేదే ఇందిరమ్మ టవర్ల ప్రధాన ఉద్దేశమని మంత్రి వివరించారు. పేదలను నగర శివార్లకు తరలించకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ పథకం కింద లబ్ధి పొందే వారికి ఫ్లాట్‌పై పూర్తి యాజమాన్య హక్కులతో పాటు, అవిభాజ్య భూమి వాటాను ఎటువంటి రిజిస్ట్రేషన్ ఛార్జీలు లేకుండా అందజేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్ల నిర్మాణానికి శంకుస్థాపనలు జరిగాయని, కొన్ని ప్రాంతాల్లో టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయిందని మంత్రి గుర్తుచేశారు. లబ్ధిదారుల అర్హతలను నిశితంగా పరిశీలించిన తర్వాత బహిరంగ డ్రాల ద్వారా ఎంపిక ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే లక్షలాది ఇళ్లను మంజూరు చేసిన ఇందిరమ్మ పథకంలో భాగంగా, పట్టణ ప్రాంత గృహ నిర్మాణానికి కూడా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. భూముల గుర్తింపుతో పాటు ఇతర అనుబంధ ప్రక్రియలను వేగవంతం చేసి, ప్రాజెక్టుల నిర్మాణ వేగాన్ని కొనసాగించాలని అధికారులను ఆదేశించారు.

# మహా నిరసనకు ఫ్రాన్స్ సిద్ధం!

పారిస్: ఫ్రాన్స్‌లో శనివారం నాటి మహా నిరసన ప్రదర్శనలను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. భద్రత పర్యవేక్షణ కోసం సుమారు 70 వేల మంది బలగాలను వినియోగించనున్నట్లు ప్రభుత్వ విర్గాల ద్వారా తెలిసింది. అంతేకాకుండా... ప్రపంచప్రఖ్యాత లోవర్‌తోపాటు ఇతర మ్యూజియమ్‌లను కూడా ముందుజాగ్రత్త చర్యగా మూసివేస్తున్నట్లు ప్రకటించారు. గత వారాంతంలో చెలరేగిన హింసను దృష్టిలో పెట్టుకుని ఈ జాగ్రత్తలన్నీ తీసుకున్నట్లుగా తెలుస్తోంది. ఫ్రాన్స్‌లో కొన్నేళ్లుగా కనీవినీ ఎరుగని స్థాయిలో ఆందోళనలు జరుగుతున్న విషయం తెలిసిందే. విద్యా వ్యవస్థలో మార్పులు, అధిక నిధుల డిమాండ్లతో మొదలైన ఈ ఆందోళనలు గత వారాంతం హింసాత్మకంగా మారాయి. దుండగులు కొందరు ప్రభుత్వ భవనాల్లోకి దూసుకెళ్లి ఆస్తి నష్టానికి కారణమయ్యారు. కొన్నిచోట్ల ఆస్తులకు నిప్పు పెట్టారు. దుకాణాల అద్దాలు బద్దలు కొట్టడంతోపాటు లూటీకి పాల్పడినట్లు వార్తలొచ్చాయి.

తాజాగా శనివారం మరో పెద్ద నిరసన కార్యక్రమానికి ఆందోళనకారులు సిద్ధమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యలు చేపట్టింది. 2018, 2019లలో అధిక ధరల నియంత్రణ డిమాండ్‌తో ఆందోళనలు చేపట్టిన 'ఎల్లో వెస్ట్'బృందం కూడా శనివారం నాటి కార్యక్రమానికి మద్దతు తెలిపింది. ఫ్రాన్స్ అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రి లారెండ్ నూనెజ్ శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ శనివారం నాడు హెలికాప్టర్లతో భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా 70 వేల మంది సిబ్బందిపి శాంతి భద్రతల పరిరక్షణకు ఉపయోగిస్తున్నామని సాయుధ వాహనాలు, జలఫిరంగులు, ప్రత్యేక పోలీసు బలగాల సేవలూ వినియోగించుకుంటుఆమని వివరించారు. వామపక్ష భావాలున్న వారు సోషల్ మీడియాలో హింస, ఆస్తి విధ్వంసాలకు పిలుపునిచ్చారని, లూటీలకు పాల్పడాలన్న మెసేజీలు కూడా చక్కర్లు కొడుతున్నాయని ఆయన ఆరోపించారు. ఇవన్నీ ఆందోళనకారులు వ్యాప్తి చేస్తున్నవేనని అన్నారు. అయితే ప్రభుత్వం కూడా శాంతి భద్రతల విషయంలో రాజీ పడబోదని స్పష్టం చేశారు. హింసకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని, అరెస్టులు, చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు.

పారిస్ శివార్లలో కాల్పులు.. ఒకరి మృతి

ఫ్రాన్స్ రాజదాని పారిస్ శివార్లలో శుక్రవారం జరిగిన కాల్పుల ఘటనలో ఒకరు మరణించగా నలుగురు గాయపడినట్లు అధికారులు తెలిపారు. ఫ్రాన్స్ ఉగ్రవాద వ్యతిరేక సంస్థ ఈ ఘటనపై విచారణ చేపట్టింది. కాల్పులకు జాతి వివక్ష కారణమా? అన్నది నిర్ధారించనుంది. ఈ ఘటనకు సంబంధించి ఇప్పటికే ఒకరిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు చెప్పారు. పారిస్ సమీపంలోని ట్రాపెస్, లా విరెరీలలో మూడు చోట్ల కాల్పుల ఘటనలు చోటు చేసుకున్నాయని, మిలటరీలో ఉపయోగించే లేంటే ఆటోమెటిక్ ఆయుధంతో అనుమానితుడు ఈ కాల్పులకు పాల్పడినట్లు తెలిసిందని ట్రాపెస్ మేయర్ అలీ రబే తెలిపారు. నిందితుడు చుట్టుపక్కల ఉన్నవారిపై యధాలాపంగా కాల్పులు జరిపారని చెప్పారు. ఒకరు మాత్రమే మరణించడం ఒక అద్భుతమనే చెప్పాలని వ్యాఖ్యానించారు. మరణించిన వ్యక్తి ఆఫ్రికా సంతతి వారని, తీవ్రంగా గాయపడ్డ ఒక వ్యక్తి ఉత్తర ఆఫ్రికా ప్రాంతానికి చెందిన వాడని వివరించారు

# దక్షిణ మధ్య రైల్వే బోర్డు సభ్యుడిగా అమర్ దీక్షిత్ నియామకం

○ బీజేపీ మండల శాఖ హర్షం

○ ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి



**తొలివెలుగు, కృష్ణ :** దక్షిణ మధ్య రైల్వే బోర్డు సభ్యుడిగా కృష్ణ మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్, మాజీ బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు అమర్ కుమార్ దీక్షిత్ నియమితులయ్యారు. ఈ నియామకంపై బీజేపీ మండల శాఖ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లా రైల్వే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, రైళ్ల రాకపోకలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడం కోసం అమర్ కుమార్ దీక్షిత్ కొన్నేళ్లుగా కృషి చేస్తున్నారని పార్టీ నాయకులు తెలిపారు. ఈ అంశాలను ఎప్పటికప్పుడు దక్షిణ మధ్య రైల్వే అధికారులతో పాటు, పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణ, పలువురు మంత్రుల దృష్టికి తీసుకెళ్తూ ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి ప్రయత్నించారని పేర్కొన్నారు. ఆయన సేవలను గుర్తించిన ఎంపీ డీకే అరుణ, అమర్ కుమార్ దీక్షిత్ పేరును దక్షిణ మధ్య రైల్వే బోర్డు సభ్యత్వం కోసం సిఫారసు చేయగా, శుక్రవారం అధికారికంగా నియామక ఉత్తర్వులు వెలువడ్డాయని తెలిపారు. ఈ నియామకం ద్వారా రైల్వే ప్రయాణికుల సమస్యలను బోర్డు దృష్టికి తీసుకెళ్లేందుకు అవకాశం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా నాయకులు సోమశేఖర్ గౌడ్, మజ్జిగ సురేష్, కృష్ణ మండల మాజీ అధ్యక్షుడు జగ్గిలి హుస్సేన్ అప్ప, జి. శ్రీనివాసులు, మండల అధ్యక్షుడు నల్లె నరసప్ప, ప్రధాన కార్యదర్శులు దండు రాఘవేంద్ర, సచిన్ బట్, మహిళా మోర్చా నాయకురాలు లక్ష్మీ సింగ్ ఠాకూర్, నారాయణ బట్, డీకే కృష్ణప్పతో పాటు బీజేపీ కార్యకర్తలు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# మొరిపిరాలలో ఎంఎస్ఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

○ విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలి

○ చదువుకు దూరమై ఎవరూ మధ్యలోనే ఆపేయొద్దు: నల్ల చంద్రస్వామి మాదిగ



**తొలివెలుగు, ఆత్మకూరు(ఎం) :** మండలంలోని మొరిపిరాల గ్రామంలో శుక్రవారం మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఆర్పీఎస్ ఆలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్ల చంద్రస్వామి మాదిగ మాట్లాడుతూ, విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని పిలుపునిచ్చారు. మంద కృష్ణ మాదిగ 32 ఏళ్లుగా చేసిన పోరాట ఫలితంగా సాధించిన ఎస్సీ వర్గీకరణ ప్రయోజనాలను ప్రతి మాదిగ విద్యార్థి అందిపుచ్చుకోవాలని అన్నారు. విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని, ఆర్థిక లేదా ఇతర కారణాలతో ఎవరూ చదువును మధ్యలోనే ఆపివేసి బడి మానేసే పరిస్థితి రాకూడదని సూచించారు. విద్యాసంస్థల్లో విద్యార్థులు ఏవైనా సమస్యలు ఎదుర్కొంటే ఎంఎస్ఎఫ్, ఎంఆర్పీఎస్ అండగా నిలుస్తాయని భరోసా ఇచ్చారు. ఎంఎస్ఎఫ్ మొరిపిరాల గ్రామ అధ్యక్షుడిగా పుట్టల రమేష్ మాదిగ, అధికార ప్రతినిధిగా ముప్పిడి భాను ప్రసాద్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా ముప్పిడి సందీప్ మాదిగ ఎన్నికయ్యారు. బాలికల కమిటీ అధ్యక్షురాలిగా ముప్పిడి వెన్నెల మాదిగ, ఎంఎస్‌యూ అధ్యక్షుడిగా బండారి సిద్ధార్థ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ మండల సహాయ కార్యదర్శి ముప్పిడి స్వామి మాదిగ, సీనియర్ నాయకుడు ముప్పిడి రాజయ్య మాదిగ, వార్డు సభ్యుడు ముప్పిడి ప్రవీణ్ మాదిగతో పాటు గ్రామ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా దుర్గాదేవి నిమజ్జన శోభాయాత్ర

○ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన జిల్లా కాంగ్రెస్ నాయకుడు సామ మధుసూదన్ రెడ్డి

○ కోలాట ప్రదర్శనలతో గ్రామ వీధుల్లో సాగిన శోభాయాత్ర

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** మండలంలోని జలాల్పురం గ్రామంలో జీడీయూసీ టీం దుర్గా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి నిమజ్జన శోభాయాత్రను అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తుల కోలాట ప్రదర్శనలు, జై దుర్గామాత నినాదాల మధ్య గ్రామ పురవీధుల గుండా శోభాయాత్ర సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ నాయకుడు సామ మధుసూదన్ రెడ్డి ఉత్సవాలకు హాజరై దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని భక్తులు ప్రార్థించారు. నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఉత్సవ కమిటీ సభ్యులను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గుండ్ల మహేష్, సీతారామచంద్రస్వామి దేవాలయ చైర్మన్ కేసారం సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ మండల నాయకుడు నక్క శ్రీనివాస్ రెడ్డి, గోరంటి రాజిరెడ్డి, వార్డు సభ్యులు బహిర్ శివాజీ గౌడ్, శాపాక బాలమణి, ఉపాధ్యక్షుడు ఏదుళ్ల శ్రీధర్ రెడ్డి, యువజన విభాగం అధ్యక్షుడు పాలకూర రాజు, నాయకులు శాపాక శంకర్, వడ్డేపల్లి విష్ణు, కేసారం శ్రీకాంత్ రెడ్డి, గుండ్ల శ్రీరాములు, బుగ్గయ్య, భాను, జగదీష్, బాలు, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



# చనిపోయింది అక్కడ.. డెత్ సర్టిఫికెట్ ఇక్కడ!

○ హైదరాబాద్‌లో మరణిస్తే చిన్నగూడూరులో జరిగినట్లు ధ్రువీకరణ?

○ 11 గ్రామపంచాయతీలపై పర్యవేక్షణ ఏదీ?

○ మెమోలతోనే సరి.. చర్యలు తీసుకునేదెప్పుడు?

**తొలివెలుగు, చిన్నగూడూరు :** మరణించింది హైదరాబాద్‌లో.. కానీ మరణ ధ్రువీకరణ పత్రం మాత్రం చిన్నగూడూరులో జారీ అయిందనే ఆరోపణలు మండలంలో చర్చనీయాంశంగా మారాయి. చిన్నకోడూరు మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి హైదరాబాద్‌లో మృతి చెందగా, చిన్నగూడూరు గ్రామంలో మరణించినట్లు ఇక్కడి గ్రామ కార్యదర్శి ధ్రువీకరణ పత్రం జారీ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారంపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అసలు మరణం ఎక్కడ సంభవించింది? ఏ ఆధారాలతో ధ్రువీకరణ పత్రం జారీ చేశారు? సంబంధిత రికార్డులను నిబంధనల ప్రకారం పరిశీలించారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.







### మరణం ఎక్కడ జరిగితే.. అక్కడే నమోదు చేయాలి!

మరణ నమోదు, ధ్రువీకరణ పత్రాల జారీ ప్రక్రియలో నిబంధనలు పాటించడం అత్యంత కీలకం. మరణించిన వ్యక్తి వివరాలు, మరణం సంభవించిన ప్రదేశం, సంబంధిత ఆధారాలను పరిశీలించిన తర్వాతే రికార్డుల్లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ వ్యవహారంలో నిబంధనలకు విరుద్ధంగా ధ్రువీకరణ పత్రం జారీ చేశారనే ఆరోపణలు నిజమైతే, అది అధికారుల విధి నిర్వహణపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతుంది. సర్టిఫికెట్ జారీకి సమర్పించిన ఆధారాలు, సంబంధిత రిజిస్టర్లలో నమోదైన వివరాలను ఉన్నతాధికారులు క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

### 11 గ్రామపంచాయతీలపై పర్యవేక్షణ ఏదీ?

చిన్నగూడూరు మండల పరిధిలోని 11 గ్రామపంచాయతీల్లో గ్రామ కార్యదర్శుల పనితీరు, రికార్డుల నిర్వహణ, వివిధ ధ్రువీకరణ పత్రాల జారీ ప్రక్రియను పర్యవేక్షించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది. అయితే క్షేత్రస్థాయిలో తనిఖీలు ఎంతవరకు జరుగుతున్నాయి? కార్యదర్శులు నిబంధనల ప్రకారం విధులు నిర్వహిస్తున్నారా? రికార్డుల నిర్వహణలో ఏవైనా లోపాలున్నాయా? అనే ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి. కార్యాలయ విధులకే పరిమితం కాకుండా గ్రామాల్లో తనిఖీలు నిర్వహించి, లోపాలను గుర్తించి సరిదిద్దాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో మండల పంచాయతీ అధికారి (ఎంపీవో) పర్యవేక్షణపై కూడా చర్చ జరుగుతోంది.

### మెమోలతోనే సరిపెడతారా?

సంబంధిత గ్రామ కార్యదర్శికి గతంలోనూ పలుమార్లు మెమోలు జారీ అయినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే వాటికి సంబంధించిన అధికారిక వివరాలు, తదనంతరం తీసుకున్న చర్యలపై స్పష్టత రావాల్సి ఉంది. గతంలోనే హెచ్చరికలు జారీ చేసినట్లు చెబుతున్నా, మళ్లీ ఇలాంటి ఆరోపణలు ఎందుకు తెరపైకి వస్తున్నాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. తప్పిదాలు జరిగితే వాటిని సరిదిద్దేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు? బాధ్యత వహించాల్సిన అధికారులపై చర్యలు ఉన్నాయా? లేక మెమోలకే పరిమితమయ్యారా? అన్న అంశాలపై ఉన్నతాధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

### సమగ్ర విచారణతోనే వాస్తవాలు వెలుగులోకి!

మరణ ధ్రువీకరణ పత్రం జారీ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. సర్టిఫికెట్ జారీకి ఉపయోగించిన ఆధారాలు, నమోదు పుస్తకాలు, సంబంధిత పత్రాలను పరిశీలించి బాధ్యులెవరో తేల్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఆరోపణలు నిజమని నిర్ధారణ అయితే సంబంధిత గ్రామ కార్యదర్శితో పాటు పర్యవేక్షణ బాధ్యత కలిగిన అధికారుల పాత్రను కూడా పరిశీలించి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మండలంలోని 11 గ్రామపంచాయతీల్లో రికార్డుల నిర్వహణ, ధ్రువీకరణ పత్రాల జారీపై క్షేత్రస్థాయి తనిఖీలు చేపడితేనే ఇలాంటి వ్యవహారాలకు అడ్డుకట్ట పడుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు వివరణ ఇవ్వాల్సి ఉంది. విచారణలో వాస్తవాలు తేలిన తర్వాతే బాధ్యత, చర్యలపై స్పష్టత రానుంది.

# నేల ఆరోగ్యమే రైతుకు బలం.. భూముల పరిరక్షణే లక్ష్యం!



○ పల్లెర్లలో 'ఖేత్ బచావో అభియాన్' కార్యక్రమం

○ నేల పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన

○ సేంద్రియ ఎరువులు, పంట మార్పిడితో భూసారం పెంపు: వ్యవసాయ విస్తరణ అధికారి అశోక్ కుమార్

**తొలివెలుగు, ఆత్మకూరు(ఎం) :** వ్యవసాయ భూముల సారవంతాన్ని కాపాడుకుంటూ నేల ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి ముప్పిడి అశోక్ కుమార్ రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని పల్లెర్ల గ్రామపంచాయతీలో నిర్వహించిన 'ఖేత్ బచావో అభియాన్' కార్యక్రమంలో భాగంగా రైతులకు నేల పరిరక్షణ, నేల పరీక్షలు, సమతుల్య ఎరువుల వినియోగం, సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అశోక్ కుమార్ మాట్లాడుతూ.. నేల పరీక్షల ఫలితాల ఆధారంగా పంటలకు అవసరమైన ఎరువులను సరైన మోతాదులో వినియోగించాలని సూచించారు. పశువుల ఎరువు, కంపోస్ట్, పచ్చిరొట్ట ఎరువుల వినియోగం ద్వారా నేలలో సేంద్రియ పదార్థాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. రసాయన ఎరువులను అవసరానికి మించి వినియోగించకుండా సమతుల్య పద్ధతులను పాటించాలని వివరించారు. పంట కోత అనంతరం మిగిలే అవశేషాలను కాల్చకుండా వ్యవసాయానికి ఉపయోగపడేలా సద్వినియోగం చేసుకోవాలని అశోక్ కుమార్ సూచించారు. పంట మార్పిడి విధానాన్ని అనుసరించడం ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. భూగర్భజలాల లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని, నేల కోతను నివారించే చర్యలు చేపట్టాలని చెప్పారు. నీటి సంరక్షణకు ప్రాధాన్యమిస్తూ పర్యావరణహిత వ్యవసాయ పద్ధతులను పాటించాలని రైతులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాములు నాయక్, ఏఈ మెహర్ సాయి, పశువైద్యాధికారి డాక్టర్ గిరి, ఏపీవో రమేష్, హెచ్ఈవో శ్రీనివాసులు, పల్లెర్ల సర్పంచ్ తండ మంజుల, లింగరాజుపల్లి సర్పంచ్ ఎర్ర సోమిరెడ్డి, రాఘవాపురం సర్పంచ్ ఎరుకల యతీశ్వర్, పంచాయతీ కార్యదర్శులు బాలరాజు, వి. శ్రీనివాస్, శ్రీనివాస్ చారితో పాటు రైతులు నర్సింహ్ గౌడ్, సుదర్శన్, రామలక్ష్మయ్య, యాదిరెడ్డి, మల్లేష్, మచ్చగిరి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# పత్తి రైతులకు భరోసా.. సీసీఐ కొనుగోలు కేంద్రం ప్రారంభం

○ కొనుగోళ్లకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

○ క్వింటాల్‌కు రూ.8,667 వరకు కనీస మద్దతు ధర

○ నిబంధనలపై రైతులకు అవగాహన.. దళారుల బారిన పడొద్దని సూచన



**తొలివెలుగు, ఆత్మకూరు(ఎం) :** పత్తి రైతులకు కనీస మద్దతు ధర కల్పించి, దళారుల దోపిడీ నుంచి రక్షించడమే లక్ష్యంగా మండల కేంద్రంలోని సిద్ధేశ్వర జిన్నింగ్ మిల్లులో భారతీయ పత్తి సంస్థ (సీసీఐ) కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా 2026-27 పత్తి సీజన్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరలు, కొనుగోలు నిబంధనలను రైతులకు వివరించారు. రైతులు నాణ్యమైన పత్తిని కేంద్రానికి తీసుకొచ్చి ప్రభుత్వ కొనుగోలు సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. పత్తి రకాన్ని బట్టి కనీస మద్దతు ధరలు నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. బీబీ బన్నీ/బ్రహ్మ రకం పత్తికి క్వింటాల్‌కు రూ.8,667, బీబీ ఎస్వీఎల్ రకానికి రూ.8,617, ఎంఈసిహెచ్ రకానికి రూ.8,567 చొప్పున ధరలు వర్తిస్తాయని వివరించారు. పత్తిలో తేమ శాతాన్ని బట్టి కొనుగోలు ధరలో మార్పులు ఉంటాయని పేర్కొన్నారు. 8 నుంచి 12 శాతం వరకు తేమ ఉన్న పత్తికి నిబంధనల ప్రకారం ధరలో కోత విధిస్తారని, 12 శాతానికి మించి తేమ ఉన్న పత్తిని కొనుగోలు చేయరని తెలిపారు. అందువల్ల రైతులు పత్తిని బాగా ఆరబెట్టి, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. నాణ్యత లేని, రంగు మారిన లేదా వర్షానికి తడిసిన పత్తిని కొనుగోలు చేయడం సాధ్యం కాదని అధికారులు స్పష్టం చేశారు. పత్తిలోని మైక్రోనేర్ విలువ నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా లేకపోతే, ప్రతి 0.2 విలువకు రూ.25 చొప్పున ధరలో కోత విధించే నిబంధనలు ఉన్నాయని వివరించారు. రైతులు పత్తిని విడి రూపంలోనే కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని తెలిపారు. సంబంధిత వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో ఆధార్ ఆధారిత ఆన్‌లైన్ నమోదు పూర్తి చేసుకున్న రైతుల నుంచే కొనుగోళ్లు చేపడతామని పేర్కొన్నారు. ముందుగానే నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. పత్తి విక్రయాలకు సంబంధించిన నగదును ఏబీపీఎస్/పీఎఫ్ఎంఎస్ విధానాల ద్వారా ఆధార్‌తో అనుసంధానమైన బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేస్తారని అధికారులు తెలిపారు. రైతులు తమ బ్యాంకు ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేసుకోవడంతో పాటు, ఖాతా వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో ముందుగానే పరిశీలించుకోవాలని సూచించారు. కొనుగోళ్లకు సంబంధించిన సందేహాలు, ఇతర సహాయం కోసం సీసీఐ మహబూబ్‌నగర్ కార్యాలయ ఫోన్ నంబర్ 08542-222210, వాట్సాప్ సహాయ నంబర్ 8978978517ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, సిద్ధేశ్వర జిన్నింగ్ మిల్లు యాజమాన్య ప్రతినిధులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 'ఎల్‌నినో' ముప్పుపై అప్రమత్తంగా ఉండాలి

○ రబీలో ప్రత్యామ్నాయ పంటల సాగుతోనే మేలు

○ చల్లూరు, బేగంపేట, నమిలలో ప్రత్యేక గ్రామసభలు

**తొలివెలుగు, రాజాపేట :** ప్రకృతిలో సంభవించే 'ఎల్‌నినో' ప్రభావంతో ఎదురయ్యే వాతావరణ పరిస్థితులపై రైతులు, ప్రజలు అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని రేణికుంట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్ నమిల మహేందర్ గౌడ్ సూచించారు. నీటిని పొదుపుగా వినియోగించుకోవడంతో పాటు, ముందస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారా వాతావరణ ప్రతికూల పరిస్థితులను సమర్థంగా ఎదుర్కోవచ్చని పేర్కొన్నారు. శుక్రవారం రాజాపేట మండల పరిధిలోని చల్లూరు, బేగంపేట, నమిల గ్రామ పంచాయతీ కార్యాలయాల ఆవరణలో 'ఎల్‌నినో ముప్పును ఎదుర్కొనేందుకు' స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహేందర్ గౌడ్ మాట్లాడుతూ నీటి వనరులను వృథా చేయకుండా సంరక్షించుకోవాలని, వ్యవసాయంలో నీటి వినియోగంపై రైతులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు.

**రబీలో తక్కువ నీటితో పండే పంటలపై దృష్టి:**

వ్యవసాయ శాఖ ఇన్‌చార్జి ఏడీఏ పద్మజ మాట్లాడుతూ రాబోయే రబీ సీజన్‌లో వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని రైతులకు సూచించారు. పెసర, కందులు, బొబ్బర్లు, జనుము, మొక్కజొన్న, మినుము వంటి ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని, అనుకూల పరిస్థితుల్లో ఆయిల్‌పామ్ తోటల పెంపకాన్ని కూడా పరిశీలించాలని వివరించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవడం ద్వారా నీటి కొరత ప్రభావాన్ని తగ్గించుకోవచ్చని అవగాహన కల్పించారు.



**ప్రచారం లేకుండా గ్రామసభలా?**

మరోవైపు, ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు నిర్వహించిన గ్రామసభలపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశాల గురించి ముందస్తు సమాచారం ఇవ్వకపోవడం, తగిన ప్రచారం కల్పించకపోవడంతో రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమం ఆశించిన స్థాయిలో జరగలేదని పలువురు అభిప్రాయపడ్డారు. కీలకమైన అంశంపై నిర్వహించే సమావేశాలకు రైతులు, ప్రజలకు ముందుగానే సమాచారం అందించి, విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీవో కూతల నాగవేణి, వ్యవసాయాధికారి పద్మజ, ఉపాధి హామీ పథకం ఏపీఓ, నీటిపారుదల, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ శాఖల అధికారులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, ఆత్మ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

# దొడ్డి కొమరయ్యకు దక్కిన గౌరవం

○ ట్యాంక్‌బండ్‌పై విగ్రహ ఏర్పాటు నిర్ణయంపై హర్షాతిరేకాలు

○ సీఎం రేవంత్‌రెడ్డి, విప్ బీర్ల ఐలయ్య చిత్రపటాలకు పాలాభిషేకం

**తొలివెలుగు, రాజాపేట :** తెలంగాణ వీరుడు, తొలి అమరుడు దొడ్డి కొమరయ్య నిలువెత్తు విగ్రహాన్ని హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ప్రతిష్ఠించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించడం పట్ల కురుమ సంఘం నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. రాజాపేట మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తాలో కురుమ సంఘం మండల అధ్యక్షుడు వస్పరి సుధాకర్ అధ్యక్షతన సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యల చిత్రపటాలకు శుక్రవారం ఘనంగా పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జూకంటి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. పదేళ్ల గత పాలకులు దొడ్డి కొమరయ్య విగ్రహ ఏర్పాటును పట్టించుకోకుండా తీవ్ర నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు.




బీర్ల ఐలయ్య చొరవతో సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి ఆదేశాలు ఇవ్వడం అభినందనీయమన్నారు. ఇదే క్రమంలో వరంగల్ ఎయిర్‌పోర్టుకు కూడా దొడ్డి కొమరయ్య పేరు నామకరణం చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కురుమ సంఘం నేతలు చీర మహిపాల్, బాల్ద శ్రీకాంత్, రేగు సిద్ధులు, పోసుగొండ మధు, ఎమ్మ శ్రీను, కోరే కృష్ణ, సీపీఐ నాయకుడు చిగుళ్ల లింగం, కాంగ్రెస్ నాయకులు నకీర్త సిద్ధులు, కందుకూరి శ్రీను, మహేష్, ఏసుబాబు తదితరులు ఉన్నారు.

# రాజేంద్రనగర్‌లో మారణాయుధాల కలకలం.. రూ.4లక్షల విలువ చేసే గంజాయి, పిస్టోళ్లు స్వాధీనం

గంజాయి, మత్తు పదార్థాలను విక్రయిస్తున్న వ్యక్తిని పోలీ సులు అరెస్టు చేశారు. రాజేంద్రనగర్ ఎక్సైజ్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో గ్రేటర్ హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి వివరాలను వెల్ల డించారు. అత్తాపూర్ లోని సిక??చనీ ప్రాంతానికి చెందిన సర్దార్ రాజాసింగ్ లోన్ రికవరీ ఏజెంట్. గతేడాది నుంచి స్థానికంగా గంజాయి, పాప్పిస్ట్రా మత్తు పదార్థాలను విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ ఎస్ చీ ఓ నజీర్ పాషా, ధూల్పేట ఎసచీ ప్రవీణ్ కుమార్ తమ బృందాలతో సంయు క్తంగా కలిసి రాజాసింగ్ నివాసంపై దాడులు చేశారు. నిందితుడి వద్ద గంజాయి, పాప్పిస్ట్రా మత్తు పదార్థాలతో పాటు మారణాయుధాలు లభించాయి. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచా రించగా ధూల్ పేటలోని మంగళటక్‌కు చెందిన రాహుల్సంగ్ వద్ద నుంచి గంజా యిని, నాందేడ్‌లో ఓ వ్యక్తి నుంచి పాప్పిస్ట్రా మత్తు పదార్థాన్ని కొనుగోలు చేసినట్లు పోలీసులు తెలిపారు. అయితే మారణాయు ధాలు తన తండ్రి నుంచి వచ్చినట్లుగా నిందితుడు వెల్లడించినట్లు డీసీ వివరిం చారు. ఎక్సైజ్ పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి, రూ.4లక్షల విలువ చేసే 1.5 కిలోల ఎండు గంజాయి, 1.13కిలోల పాప్పిస్ట్రా, ఒక తుపాకీ, రెండు పిస్టోళ్లు, ఐదు రౌండ్ల తూటాలను స్వాధీనం చేసుకు న్నారు. గ్రేటర్ హైదరాబాద్ డీసీ శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ దాడుల్లో రాజేంద్రనగర్ ఎసాచీ నజీర్ పాషా, ధూల్పేట ఎస్ హెచ్ ఓ ప్రవీణ్ కు మార్, సీఐలు విప్లవరెడ్డి, వెంకన్న, విజయ్, సిబ్బంది జనార్ధన్, ప్రసాదావు, సాబేర్, నాగరాజు, సూర్య, రాజేశ్, లేఖ సింగ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రులంతా ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

○ బిఆర్ఎస్ అభ్యర్థి రాకేష్ రెడ్డి విజయం ఖాయం: మాజీ ఎమ్మెల్యే సునీత

○ ఇన్‌ఛార్జుల సన్నాహక సమావేశం

**తొలివెలుగు, రాజాపేట :** అర్హులైన పట్టభద్రులందరూ తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి కోరారు. రాజాపేట మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటు నమోదు ఇన్‌ఛార్జుల సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ.. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి రాకేష్ రెడ్డి గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఇన్‌ఛార్జులు గ్రామగ్రామాన, గడపగడపకూ వెళ్లి పట్టభద్రులను గుర్తించి ఓటు నమోదు చేయించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి డిపాజిట్ కూడా రాదని ఎద్దేవా చేశారు. రాకేష్ రెడ్డి విజయం కోసం బిఆర్ఎస్ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు తిరుమలేష్, మాజీ జెడ్పీటీసీ గోపాల్ గౌడ్, నాయకులు పల్లె సంతోష్ గౌడ్, గుంటి కృష్ణ, రామిల్ల నరేందర్, మధుసూదన్ రెడ్డి, రెడ్డబోయిన రాజు, గంధమల సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# వనస్థలిపురంలో మెరవనున్న వజ్రాభరణాలు

○ జోయాలుక్కాస్‌లో అట్టహాసంగా 'బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో'

○ రూ.లక్ష విలువైన వజ్రాభరణాల కొనుగోలుపై ఉచిత బంగారు నాణెం

○ నేటి నుంచి ప్రత్యేక ప్రదర్శన.. సంప్రదాయ, ఆధునిక డిజైన్లతో ఆకట్టుకుంటున్న నగలు

**తొలివెలుగు, వనస్థలిపురం:** వజ్రాభరణాల ప్రియులను ఆకట్టుకునేందుకు ప్రముఖ నగల సంస్థ జోయాలుక్కాస్ వనస్థలిపురం షోరూమ్‌లో ప్రత్యేకంగా 'బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో'ను ప్రారంభించింది. అక్టోబర్ 23 నుంచి అందుబాటులోకి వచ్చిన ఈ ప్రత్యేక ప్రదర్శనలో సంప్రదాయ కళాత్మకతకు ఆధునికతను జోడించిన విభిన్న డిజైన్ల వజ్రాభరణాలను ప్రదర్శనకు ఉంచినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.

**పెళ్లిళ్లకు, రోజువారీ వినియోగానికి ప్రత్యేక డిజైన్లు:**

పెళ్లిళ్లు, శుభకార్యాలకు అనువైన ఆకర్షణీయమైన వజ్రాభరణాల సెట్లతో పాటు రోజువారీగా ధరించేందుకు వీలుగా రూపొందించిన ఆధునిక డిజైన్లు ఈ ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. విభిన్న అభిరుచులకు అనుగుణంగా రూపొందించిన నగలు వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయని సంస్థ వర్గాలు పేర్కొన్నాయి.

**కొనుగోలుపై బంగారు నాణెం ఉచితం:**

వినియోగదారుల కోసం జోయాలుక్కాస్ ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించింది. ఈ ప్రదర్శనలో రూ.లక్ష లేదా అంతకంటే ఎక్కువ విలువైన వజ్రాభరణాలను కొనుగోలు చేసే వారికి ఉచితంగా ఒక బంగారు నాణెం అందజేయనున్నట్లు వెల్లడించింది. పరిమిత కాలం పాటు మాత్రమే ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుందని తెలిపింది. వజ్రాభరణాలు కొనుగోలు చేయాలనుకునే వారు ఈ ప్రత్యేక ప్రదర్శనను సందర్శించి, తమ అభిరుచికి తగిన డిజైన్లను ఎంపిక చేసుకోవాలని సంస్థ ప్రతినిధులు కోరారు.





# విద్యానగర్‌లో మురుగు కష్టాలు

○ డ్రైనేజీ సమస్యను పరిశీలించిన కళ్లెం నవజీవన్ రెడ్డి

○ తక్షణమే పరిష్కరించాలని అధికారులకు విజ్ఞప్తి

**తొలివెలుగు, హయత్‌నగర్ :** హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని విద్యానగర్ కాలనీలో గత కొన్ని రోజులుగా డ్రైనేజీ సమస్య తీవ్రంగా మారి స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారని మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీ వాసుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు శుక్రవారం ఆయన స్వయంగా ప్రాంతాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. మురుగునీరు రోడ్లపై పారుతుండటంతో కలుగుతున్న దుర్గంధం, ఆరోగ్య సమస్యల గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యపై జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులు తక్షణమే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, అధికారులు అలసత్వం వీడి తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

# జవహర్‌నగర్ డంపింగ్ యార్డు తరలింపునకు సమరశంఖం

○ ఈటల రాజేందర్ నేతృత్వంలో పాదయాత్ర సన్నాహక సమావేశం

○ హాజరైన మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి



**తొలివెలుగు, హయత్‌నగర్ :** జవహర్‌నగర్ డంపింగ్ యార్డు వల్ల పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర కాలుష్యంతో, ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్నారని, దానిని తక్షణమే తరలించేందుకు ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తున్నట్లు హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి తెలిపారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ నేతృత్వంలో నిర్వహించిన డంపింగ్ యార్డు తరలింపు ఉద్యమ కార్యాచరణ మరియు పాదయాత్ర సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ.. డంపింగ్ యార్డు కారణంగా పరిసర ప్రాంతాల్లో పర్యావరణ కాలుష్యం పెరిగి ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఈ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తామన్నారు. నిర్వహించబోయే పాదయాత్ర ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి డంపింగ్ యార్డును వేరే ప్రాంతానికి తరలించేలా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.

# పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షుడిగా రుద్ర భిక్షపతి



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి పురపాలక పరిధిలోని ముక్తాపూర్ పద్మశాలి మహాజన సంఘం సర్వసభ్య సమావేశం శు క్రవారం ఘనంగా నిర్వహించారు. మాజీ కౌన్సిలర్ కొంగర కృష్ణ, వివేకానంద యువజన సంఘం మాజీ అధ్యక్షుడు రుద్ర వీరస్వామి ముఖ్య అతిథులుగా హాజరైన ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం నూతన అధ్యక్షుడిగా రుద్ర భిక్షపతి, ఉపాధ్యక్షుడిగా కొంగరి బాల నరసింహ, కార్యదర్శిగా కర్నాటి బాలరత్నం, కోశాధికారిగా రుద్ర శంకర్, సహాయ కోశాధికారిగా రుద్ర వీరస్వామి ఎన్నికయ్యారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా గంజి నరసింహ, రుద్ర రాములవారు, ఆడెపు పాండురంగం, బాస బాలరాజు, రుద్ర లక్ష్మీనారాయణ, రవ్వ బాల నరసింహ, రుద్ర బాలకృష్ణ, పొడుగు శివకుమార్‌లను ఎన్నుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# శంషాబాద్ ఎయిర్‌పోర్టులో భారీగా ఫారిన్ కరెన్సీ పట్టివేత



హైదరాబాద్ నగర శివారులోని శంషాబాద్ ఎయిర్‌పోర్టు లో తనిఖీలను ఎంత కట్టుదిట్టం చేసినా బంగారం స్మగ్లింగ్ విదేశీ కరెన్సీ అక్రమరవాణా యథేచ్ఛగా జరుగుతూనే ఉంది. నిత్యం ఎయిర్‌పోర్టు సెక్యూరిటీ అధికారులకు స్మగ్లర్‌లు (రాఎబస్త్రస్త్రశ్రీవతీం) పట్టుబడుతూనే ఉన్నారు. తాజాగా ఇద్దరు ప్రయాణికుల నుంచి భారీగా ఫారిన్ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. శనివారం ఉదయం ఇద్దరు ప్రయాణికులు కౌలాలంపూర్ వెళ్లేందుకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చారు. అయితే వారి నడవడిక తేడాగా అనిపించడంతో అనుమానించిన డీఆర్ఐ అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో వారి దగ్గర భారీగా విదేశీ కరెన్సీ లభ్యమైంది. పట్టుబడ్డ నగదు విలువ దాదాపుగా రూ.1.56 కోట్లు ఉంటుందని డీఆర్ఐ అధికారులు తెలిపారు. ఇద్దరు నిందితులు ఎయిర్‌ఏషియా ఏకే-68 విమానంలో వెళ్లేందుకు వచ్చి పట్టుబడ్డారు. పోలీసులు ఇద్దరినీ అరెస్టు చేశారు.



# ఎస్ఐఆర్ ప్రక్రియను వెంటనే రద్దు చేయాలి

**ం కేంద్ర ఎన్నికల కమిషనర్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్**

**ం రాజాపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏఐకేఎంఎస్ ధర్నా**

**తొలివెలుగు, రాజాపేట :** ప్రజా వ్యతిరేక ఎస్ఐఆర్ ప్రక్రియను బేషరతుగా రద్దు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా ఉపాధ్యక్షుడు మామిడాల బాలమల్లేష్, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రేగు శ్రీశైలం డిమాండ్ చేశారు. శుక్రవారం రాజాపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించే వారిని, మైనారిటీ వర్గాలకు చెందిన అర్హులైన భారతీయులను ఓటర్ల జాబితా నుంచి అక్రమంగా తొలగిస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ స్వతంత్రంగా వ్యవహరించకుండా ప్రభుత్వ ఏజెంట్‌లా పనిచేస్తున్నారని విమర్శించారు. తొలగించిన అర్హులైన ఓటర్ల పేర్లను వెంటనే తిరిగి జాబితాలో చేర్చాలని, జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ మండల నాయకుడు పుప్పాల సిద్దులు, హమాలి వర్కర్స్ యూనియన్ నాయకులు ఎమ్మ బాలరాజు, బచ్చలి నర్సింహులు, బైకని భిక్షపతి, కొజిగ వీరయ్య, పుప్పాల మల్లయ్య, బండి సిద్దులు, కాల్లె నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

# భాస్కర్ ఆగ్రో కెమికల్స్‌లో మహిళ మృతి

**ం పరిశ్రమలో అకస్మాత్తుగా స్పృహతప్పి పడిపోయిన స్వప్న**

**ం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యుల నిర్ధారణ**

**ం మృతికి గల కారణాలపై విచారణ జరపాలని భర్త ఫిర్యాదు**



**తొలివెలుగు, చౌటుప్పల్ :** భాస్కర్ ఆగ్రో కెమికల్స్ పరిశ్రమలో పనిచేస్తున్న మహిళా కార్మికురాలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవలమ్మనాగారానికి చెందిన ఏచూరి స్వప్న (40) శుక్రవారం పరిశ్రమలో విధులు నిర్వహిస్తుండగా అకస్మాత్తుగా స్పృహతప్పి పడిపోయింది. వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వివరాల్లోకి వెళ్తే.. స్వప్న రోజూ మాదిరిగానే శుక్రవారం ఉదయం భాస్కర్ ఆగ్రో కెమికల్స్ పరిశ్రమకు పనికి వెళ్లింది. ఉదయం సుమారు 10.30 గంటల సమయంలో ఆమె పరిశ్రమలో అకస్మాత్తుగా స్పృహతప్పి పడిపోయినట్లు కంపెనీకి చెందిన శ్రీను ద్వారా భర్త కృష్ణకు సమాచారం అందింది. దీంతో ఆందోళనకు గురైన కృష్ణ వెంటనే పరిశ్రమకు చేరుకున్నాడు. అక్కడి నుంచి భార్యను ప్రైవేటు వాహనంలో అబ్దుల్లాపూర్‌మెట్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లాడు. అయితే, అప్పటికే ఆమె మృతి చెందినట్లు విధుల్లో ఉన్న వైద్యుడు ధ్రువీకరించారు. పరిశ్రమలో విధులు నిర్వహిస్తుండగా స్వప్న అకస్మాత్తుగా స్పృహతప్పి పడిపోవడం, అనంతరం ఆసుపత్రికి తీసుకెళ్లేలోపే మృతి చెందడంతో ఘటనపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పరిశ్రమలో ఏదైనా ప్రమాదం జరిగిందా? విషవాయువుల ప్రభావం వల్ల ఆమె అస్వస్థతకు గురైందా? లేక ఇతర కారణాలేమైనా ఉన్నాయా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉందని మృతురాలి కుటుంబ సభ్యులు కోరుతున్నారు. తన భార్య మృతికి గల కారణాలను నిష్పక్షపాతంగా తేల్చాలని, ఘటనకు బాధ్యులెవరైనా ఉంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని భర్త కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి. రవీందర్ తెలిపారు. పరిశ్రమలో చోటుచేసుకున్న ఈ ఘటనతో మృతురాలి కుటుంబంలో విషాదం నెలకొంది. స్వప్న మృతికి అసలు కారణాలు ఏమిటన్నది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

# రాష్ట్రాభివృద్ధికి జగనే అడ్డంకి: ప్రభుత్వ విప్ బొండా ఉమ

**స్థానిక ఎన్నికలను ఆపేందుకు వైసీపీ 59 కేసులు వేసిందని ఆరోపణ**

**2021లో దౌర్జన్యాలతో 24% ఏకగ్రీవాలు చేసుకున్నారని వ్యాఖ్య**

**కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తోందని స్పష్టీకరణ**

**2024లోనే వైసీపీ పతనం మొదలైందని, స్థానిక ఎన్నికలతో భూస్థాపితం ఖాయమని జోస్యం**

రాష్ట్ర అభివృద్ధిని, స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను అడ్డుకోవడమే వైసీపీ అధినేత జగన్ ఏకైక అజెండా అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ధ్వజమెత్తారు. ఓటమి భయంతోనే జగన్ 'క్రిమినల్ లిటిగెంట్'గా మారి, న్యాయస్థానాలను అడ్డుపెట్టుకుని ఎన్నికలను నిలిపివేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఎన్నికలను ఆపేందుకు వైసీపీ 59 కేసులు వేసిందని ఆరోపించారు. శుక్రవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థలకు 16వ ఆర్థిక సంఘం నుంచి అందాల్సిన సుమారు రూ. 12,500 కోట్ల నిధులను రాకుండా చేయడమే జగన్ కుట్ర అని బొండా ఉమ మండిపడ్డారు. "నేడు ఎన్నికలు జరిగితే వైసీపీ అడ్రస్ గల్లంతు కావడం ఖాయం. అందుకే నామినేషన్ల ప్రక్రియ మొదలైన నాటి నుంచే దౌర్జన్యాలకు తెరలేపారు. పుంగనూరు, తిరుపతి, నగరి, రాయచోటి వంటి ప్రాంతాల్లో వాహనాలను తగలబెట్టడం, రాళ్లు, కర్రలతో దాడులు చేయడం వంటి అరాచకాలకు పాల్పడ్డారు. దీనికి సంబంధించిన వీడియో ఆధారాలు కూడా స్పష్టంగా ఉన్నాయి" అని ఆయన పేర్కొన్నారు. 2021 స్థానిక ఎన్నికల్లో వైసీపీ బెదిరింపులు, కిడ్నాపులు, హత్యాయత్నాలతో 24 శాతం స్థానాలను బలవంతంగా ఏకగ్రీవం చేసుకుందని బొండా ఉమ గుర్తుచేశారు. "పుంగనూరులో 85 స్థానాలకు గానూ 84, మాచర్లలో 77 స్థానాలకు గానూ 74 స్థానాలను ఏకగ్రీవం చేసుకున్న నీచ చరిత్ర జగన్‌ది. 2014లో చంద్రబాబు హయాంలో కేవలం 1 శాతం మాత్రమే ఏకగ్రీవమయ్యాయి. దొంగే దొంగ అన్నట్లుగా, తను చేసిన అరాచకాలను ఇతరులపై నెట్టే ప్రయత్నం జగన్ చేస్తున్నారు" అని విమర్శించారు. సొంత బాబాయిని హత్య చేయించి, 'నారాసుర రక్తచరిత్ర' పేరిట దుష్ప్రచారం చేసిన వ్యక్తి జగన్ అని, గతంలో ఇచ్చిన హామీల్లో 85 శాతం అమలు చేయకుండా ఇప్పుడు అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ 27 నెలల్లో రూ. 1,60,000 కోట్లను సంక్షేమానికి ఖర్చు చేస్తూ, ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటోందని అన్నారు. స్థానిక ఎన్నికల్లో పరాజయం తప్పదనే భయంతోనే జగన్ అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని, 2024లోనే వైసీపీ పతనం ప్రారంభమైందని, స్థానిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగితే ఆ పార్టీ భూస్థాపితం కావడం ఖాయమని బొండా ఉమ జోస్యం చెప్పారు.





# ఇరగవరం మండలంలో ఎంపీటీసీ, ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ పూర్తి.. ౯౦ మంది అభ్యర్థుల నామినేషన్లు

**ఇరగవరంతొలివెలుగు:** రెండో సాధారణ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఇరగవరం మండలంలో శుక్రవారంతో ముగిసింది. అక్టోబర్ 21 నుంచి 23వ తేదీ వరకు మూడు రోజుల పాటు నిర్వహించిన నామినేషన్ల స్వీకరణ కార్యక్రమంలో మొత్తం 90 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల స్వీకరణ చివరి రోజైన శుక్రవారం వివిధ రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేశారు. రిటర్నింగ్ అధికారి కె.వి.వి. సత్యనారాయణ, మండల అభివృద్ధి అధికారి ఎ. శ్రీనివాసు, మండల తహసీల్దార్ ఎం. సుందర్ రాజు అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించారు.

| పార్టీల వారీగా అభ్యర్థుల వివరాలు ఇలా ఉన్నాయి | |
|---|---|
| టీడీపీ | 27 |
| వైఎస్సార్‌సీపీ | 41 |
| జనసేన పార్టీ | 19 |
| బీజేపీ | 1 |
| స్వతంత్ర అభ్యర్థి | 2 |

**చివరి రోజు 43 నామినేషన్లులి**

చివరి రోజైన అక్టోబర్ 23న తెలుగుదేశం పార్టీ నుంచి 18 మంది, జనసేన పార్టీ నుంచి 10 మంది, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి 12 మంది, బీజేపీ నుంచి ఒకరు, స్వతంత్ర అభ్యర్థులు ఇద్దరు కలిపి మొత్తం 43 మంది నామినేషన్లు దాఖలు చేశారు.

**మూడు రోజుల్లో 90 నామినేషన్లు**

అక్టోబర్ 21 నుంచి 23 వరకు మూడు రోజుల పాటు జరిగిన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో పార్టీ వారీగా నమోదైన నామినేషన్ల వివరాలు ఇలా ఉన్నాయి.

**మొత్తంగా 90 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.**

ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సంబంధిత అధికారులు, ఇరగవరం మండల గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారులు అవసరమైన చర్యలు చేపట్టారు.

# తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో ఎంపీటీసీ నామినేషన్ల జోరు......

**మూడు రోజుల్లో 41 ఎంపీటీసీ స్థానాలకు 214 నామినేషన్లు**




**తాడేపల్లిగూడెం:తొలివెలుగు:** తాడేపల్లిగూడెం నియోజకవర్గ పరిధిలో ఎంపీటీసీ ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ జోరుగా సాగుతోంది. నియోజకవర్గంలోని తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాల్లో మొత్తం 41 ఎంపీటీసీ స్థానాలకు మూడు రోజుల్లో 214 నామినేషన్లు దాఖలయ్యాయి. రెండు మండలాల్లోనూ ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా నామినేషన్లు సమర్పించారు.

**తాడేపల్లిగూడెం మండలంలో 122 నామినేషన్లు**

తాడేపల్లిగూడెం మండలంలో 22 ఎంపీటీసీ స్థానాలకు మొత్తం 122 నామినేషన్లు దాఖలయ్యాయి. పార్టీ వారీగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి 46, తెలుగుదేశం పార్టీ నుంచి 37, జనసేన పార్టీ నుంచి 27, స్వతంత్ర అభ్యర్థులుగా 9, బీజేపీ నుంచి 1, సీపీఎం నుంచి 2 నామినేషన్లు నమోదయ్యాయి.

**పెంటపాడు మండలంలో 92 నామినేషన్లు**

పెంటపాడు మండలంలో 19 ఎంపీటీసీ స్థానాలకు మొత్తం 92 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి 40, జనసేన పార్టీ నుంచి 27, తెలుగుదేశం పార్టీ నుంచి 16, బీజేపీ నుంచి 5, స్వతంత్ర అభ్యర్థులుగా 2, సీపీఎం నుంచి 2 నామినేషన్లు దాఖలయ్యాయి.
మొత్తంగా రెండు మండలాల్లో నామినేషన్ల సంఖ్య 214కు చేరడంతో స్థానిక రాజకీయాల్లో ఎన్నికల సందడి నెలకొంది. నామినేషన్ల ఉపసంహరణ, తుది అభ్యర్థుల జాబితా వెలువడిన అనంతరం ఎన్నికల పోటీపై మరింత స్పష్టత రానుంది.

# ఆచంట నియోజకవర్గంలో ఎంపీటీసీ స్థానాలకు 354 నామినేషన్లు......

**నాలుగు మండలాల్లో నామినేషన్ల దాఖలు.. వైఎస్సార్‌సీపీ, టీడీపీ మధ్య పోటీలి**

**ఆచంట, తొలివెలుగు:** ఆచంట నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో ఎంపీటీసీ స్థానాలకు మొత్తం లి354 నామినేషన్లులి దాఖలయ్యాయి. పెనుమంట్ర, పోడూరు, పెనుగొండ, ఆచంట మండలాల్లో వివిధ రాజకీయ పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా నామినేషన్లు సమర్పించారు. మండలాల వారీగా నామినేషన్ల వివరాలు ఇలా ఉన్నాయి.

**పెనుమంట్ర మండలం: 79 నామినేషన్లు**

పెనుమంట్ర మండలంలో మొత్తం 79 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో టీడీపీ నుంచి 28, వైఎస్సార్‌సీపీ నుంచి 39, జనసేన నుంచి 8, సీపీఐ(ఎం) నుంచి 1, స్వతంత్ర అభ్యర్థులు 3 నామినేషన్లు సమర్పించారు.

**పోడూరు మండలం: 100 నామినేషన్లు**

పోడూరు మండలంలో అత్యధికంగా 100 నామినేషన్లు దాఖలయ్యాయి. టీడీపీ నుంచి 38, వైఎస్సార్‌సీపీ నుంచి 40, జనసేన నుంచి 13, బీజేపీ నుంచి 5, సీపీఐ(ఎం) నుంచి 1, స్వతంత్ర అభ్యర్థులు 2, బీఎస్పీ నుంచి 1 నామినేషన్ దాఖలైంది.

**పెనుగొండ మండలం: 94 నామినేషన్లు**

పెనుగొండ మండలంలో మొత్తం 94 నామినేషన్లు దాఖలయ్యాయి. టీడీపీ నుంచి 28, వైఎస్సార్‌సీపీ నుంచి 40, జనసేన నుంచి 15, బీజేపీ నుంచి 2, స్వతంత్ర అభ్యర్థులు 5, బీఎస్పీ నుంచి 1, సీపీఐ(ఎం) నుంచి 2, కాంగ్రెస్ (ఐఎన్‌సీ) నుంచి 1 నామినేషన్ సమర్పించారు.

**ఆచంట మండలం: 81 నామినేషన్లు**

ఆచంట మండలంలో మొత్తం 81 నామినేషన్లు దాఖలయ్యాయి. టీడీపీ నుంచి 28, వైఎస్సార్‌సీపీ నుంచి 39, జనసేన నుంచి 8, బీజేపీ నుంచి 2, సీపీఐ(ఎం) నుంచి 1, స్వతంత్ర అభ్యర్థులు 3 నామినేషన్లు దాఖలు చేశారు.

**పోడూరులో అత్యధిక నామినేషన్లు**

నాలుగు మండలాల వివరాలను పరిశీలిస్తే పోడూరు మండలంలో 100 నామినేషన్లతో అత్యధికంగా నమోదయ్యాయి. ఆ తర్వాత పెనుగొండలో 94, ఆచంటలో 81, పెనుమంట్రలో 79 నామినేషన్లు దాఖలయ్యాయి. మొత్తంగా ఆచంట నియోజకవర్గంలో ఎంపీటీసీ స్థానాలకు రాజకీయ పార్టీల మధ్య పోటీ ఆసక్తికరంగా మారింది.

# తణుకు నియోజకవర్గంలో కూటమి అభ్యర్థుల ఎంపిక పూర్తి.

**56 ఎంపీటీసీ, 3 జెడ్పీటీసీ స్థానాల్లో విజయమే లక్ష్యం**

**అన్ని సామాజిక వర్గాలకు సముచిత ప్రాధాన్యత.. 100 శాతం స్ట్రైక్ రేట్ సాధిస్తాం: ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ**





**తణుకు:తొలివెలుగు:** స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా తణుకు నియోజకవర్గంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల ఎంపికను సమష్టి నిర్ణయంతో పూర్తి చేసినట్లు తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. మూడు పార్టీల నాయకుల మధ్య సమన్వయంతో అభ్యర్థులను ఖరారు చేసి, 56 ఎంపీటీసీ, 3 జెడ్పీటీసీ స్థానాలకు నామినేషన్లు దాఖలు చేసినట్లు వెల్లడించారు. అభ్యర్థుల ఎంపికలో మహిళలు, యువతతో పాటు వివిధ సామాజిక వర్గాలకు సముచిత ప్రాధాన్యత కల్పించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. అన్ని వర్గాలకు రాజకీయ అవకాశాలు కల్పించడమే కూటమి లక్ష్యమని స్పష్టం చేశారు.

**స్థానాల పంపకం ఇలా..**

తణుకు నియోజకవర్గంలో 56 ఎంపీటీసీ స్థానాలకు గాను టీడీపీకి 36, జనసేనకు 18, బీజేపీకి 2 స్థానాలు కేటాయించినట్లు తెలిపారు. అలాగే మూడు జెడ్పీటీసీ స్థానాల్లో టీడీపీకి రెండు, బీజేపీకి ఒక స్థానం కేటాయించారు. అభ్యర్థుల్లో 30 మంది మహిళలు, 26 మంది పురుషులు ఉన్నట్లు వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పిలుపునిచ్చారు. మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి, మొత్తం 56 ఎంపీటీసీ, 3 జెడ్పీటీసీ స్థానాల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. అన్ని స్థానాల్లో గెలిచి 100 శాతం స్ట్రైక్ రేట్ సాధించడమే లక్ష్యమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కూటమి అభ్యర్థులకు బీ-ఫారాలను అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, అభ్యర్థులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# సరాక ప్రమాదంపై హరీశ్ రావు ఫైర్.. మృతుల కుటుంబాలకు కోటి పరిహారం డిమాండ్

సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని సరాక కెమికల్ పరిశ్రమలో జరిగిన గ్యాస్ లీక్ ప్రమాదంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు. ఈ దుర్ఘటనలో ఇద్దరు కార్మికులు మరణించడం పట్ల ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 1 కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం, భద్రతా ప్రమాణాలను అమలు చేయకపోవడం వల్లే పదేపదే పారిశ్రామిక ప్రమాదాలు జరుగుతున్నాయని హరీశ్ రావు ఆరోపించారు. గతంలో జరిగిన సిగాచీ ప్రమాదం నుంచి ప్రభుత్వం ఎలాంటి గుణపాఠం నేర్చుకోలేదని ఆయన విమర్శించారు. ప్రమాదానికి కారణమైన కంపెనీ యాజమాన్యంపై కఠిన చర్యలతో పాటు ఘటనపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. కార్మికుల భద్రతను పట్టించుకోకుండా, ప్రమాదాలు జరిగిన తర్వాతే అధికారులు ఫొటోలకు పోజులివ్వడానికి వస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. గతంలో సిగాచీ పరిశ్రమలో ప్రమాదానికి గురై జీవనోపాధి కోల్పోయిన 54 కుటుంబాలకు కోటి రూపాయల నష్టపరిహారం ఇస్తామన్న ముఖ్యమంత్రి హామీని వెంటనే నెరవేర్చాలని ఈ సందర్భంగా హరీశ్ రావు గుర్తుచేశారు.

# డెలివరీ ముసుగులో గంజాయి దందా.. ఇద్దరిని అరెస్టు

ఇబ్రహీంపట్నం/మంచాల, అక్టోబర్ 23 : ఆహారాన్ని అందించే డెలివరీ బ్యాగుల్లో మత్తు పదార్థాలు సరఫరా చేస్తున్న ముఠా గుట్టును మహేశ్వరం ఎస్వోటీ పోలీసులు రట్టు చేశారు. స్విగ్గీ, జొమాటో డెలివరీ బాయ్స్ ముసు గులో దర్జాగా తిరుగుతూ... గంజాయి డోర్ డెలివరీ చేస్తున్న ఇద్దరు నిందితులను మహేశ్వరం ఎస్వోటీ పోలీ సులు శుక్రవారం ఇబ్రహీంపట్నంలో అదుపులోకి తీసుకున్నారు. మహేశ్వరం ఎస్వీటీ పోలీసులు, మంచాల పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని అరకు ప్రాంతానికి చెందిన ప్రధాన నిందితుడు ప్రదీప్ నుంచి రవి, సుకేశ్ బాబు అనే వ్యక్తులు విజయవాడ కేంద్రంగా గంజాయిని కొని అక్కడి నుంచి హైదరాబాద్ నగరానికి గుట్టుచప్పుడు కాకుండా తరలించారు. పోలీ సుల కండ్లు కప్పేం దుకు స్విగ్గీ, జొమాటో బ్యాగులను సాధనంగా ఎంచుకున్నారు. ఆహార పదార్థాల డెలివరీ సిబ్బందిలా పలు కాలనీల్లో తిరుగుతూ తమ నెట్వర్క్ లోని రెగ్యులర్ వినియోగదారులకు గంజాయిని డోర్ డెలివరీ చేస్తున్నారు. కాగా, శుక్రవారం మహేశ్వరం ఎస్వోటీ పోలీసులు సాగర్ రహదారిపై ఇబ్రహీంపట్నం, ఆగాపల్లి పరి సర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తుండగా డెలివరీ బ్యాగులతో గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 1.1 కేజీల ఎండు గంజాయి, ఏపీ 29పీ 8911 నంబర్ల సిటీ 100 బైక్, గంజాయిని తూకం వేసే మిషన్, రెండు సెల్ఫోన్లను స్వాధీనం చేసుకుని మంచాల పోలీసులకు అప్పగించగా.. వారు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాల్లో ఇంజినీరింగ్ కళాశాలలు, ప్రైవేట్ హాస్టళ్లు విచ్చలవిడిగా పెరుగుతుండటంతో కొందరు గంజాయి విక్రయదారులు విద్యార్థులను గంజాయి మత్తులోకి దింపుతున్నారు. అలాగే, పరిసర ప్రాంతాల్లో పాన్ షు, స్మోకింగ్ జోన్స్ తోపాటు చిన్నచిన్న షాపుల్లోనూ గంజాయిని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

# ఏపీ మున్సిపల్ ఎన్నికల బరిలో ఎంఐఎం.. 21 స్థానాల్లో పోటీ

**ఏపీ మున్సిపల్ ఎన్నికల బరిలో దిగిన ఎంఐఎం పార్టీ**
**మొత్తం 21 స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టిన మజ్లిస్**
**కడప మేయర్, హిందూపురం ఛైర్‌పర్సన్ పదవులకు పోటీ**
**గెలుపు అవకాశాలున్న చోటే పోటీ చేయాలని సూచించిన ఓవైసీ**
**ఏపీలో ప్రచారం నిర్వహిస్తున్న హైదరాబాద్ ఎంఐఎం ఎమ్మెల్యేలు**

ఏపీ మున్సిపల్ ఎన్నికల బరిలో ఆల్ ఇండియా మజ్లిస్–ఇ–ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) పార్టీ నిలిచింది. రాష్ట్రంలోని రెండు కార్పొరేషన్లు, ఐదు మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 21 మంది అభ్యర్థులను పోటీకి దింపింది. వివరాల్లోకి వెళితే.. కడప కార్పొరేషన్ మేయర్ పదవికి, హిందూపురం మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ పదవికి ఎంఐఎం అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వీటితో పాటు విజయవాడ కార్పొరేషన్‌లోని మూడు డివిజన్లలో, హిందూపురంలో ఐదు వార్డుల్లో, ఆదోనిలో ఏడు, రాయదుర్గ్‌లో మూడు, నంద్యాల, పెనుగొండ మున్సిపాలిటీల్లో ఒక్కో వార్డు చొప్పున అభ్యర్థులను బరిలో నిలిపింది. ఇటీవలే ఏపీకి చెందిన ఎంఐఎం నేతలు హైదరాబాద్‌లో పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విస్తృతంగా పోటీ చేయడం కంటే, పార్టీకి గెలుపు అవకాశాలు బలంగా ఉన్న వార్డులు, డివిజన్లపైనే దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. పార్టీ విస్తరణ ప్రయత్నాల్లో భాగంగా హైదరాబాద్‌కు చెందిన ఎంఐఎం ఎమ్మెల్యేలు జాఫర్ హుస్సేన్ మిరాజ్, మహమ్మద్ ముబీన్, మాజిద్ హుస్సేన్, ఎమ్మెల్సీ రియాజ్ ఉల్ హసన్ ఎఫెండీ ఏపీలో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ ఉనికిని విస్తరించుకోవడంలో భాగంగా పార్టీ ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది.

# చరిత్ర సృష్టించిన డాక్టర్ రూత్... దేశంలోనే తొలి ట్రాన్స్‌జెండర్ పీజీ వైద్యురాలిగా రికార్డ్!

**దేశంలోనే తొలి ట్రాన్స్‌జెండర్ పీజీ వైద్యురాలిగా డాక్టర్ రూత్ జాన్‌పాల్**
**కుటుంబం వెలివేసినా, ఆసుపత్రులు తిరస్కరించినా మొక్కవోని దీక్షతో చదువు**
**న్యాయపోరాటంతో ఎమర్జెన్సీ మెడిసిన్‌లో ఎండీ సీటు సాధించిన వైనం**
**తాజాగా ఎండీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి, చరిత్ర పుటల్లో నిలిచిన రూత్**

స్త్రసమాజం సృష్టించిన అడ్డంకులను ఆత్మవిశ్వాసంతో ఛేదించారు. కుటుంబం దూరం పెట్టినా, అవకాశాలు తలుపులు మూసినా మొక్కవోని పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకున్నారు. పేదరికం, వివక్ష వంటి ముళ్లబాటలో నడిచి, వైద్య విద్యలో ఉన్నత శిఖరాన్ని అధిరోహించారు. ఆమే డాక్టర్ కొయ్యల రూత్ జాన్‌పాల్. వైద్య విద్యలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ (ఎండీ) పూర్తి చేసిన భారతదేశపు మొట్టమొదటి ట్రాన్స్‌జెండర్ వ్యక్తిగా ఆమె చరిత్ర పుటల్లోకి ఎక్కారు. ఖమ్మం జిల్లా రమణగుట్టలోని ఓ నిరుపేద దళిత కుటుంబంలో రూత్ జాన్‌పాల్ జన్మించారు. చిన్నప్పుడే తండ్రిని కోల్పోవడంతో, తల్లి కూలి పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషించారు. కష్టాల నడుమ చదువుకుని, వైద్యురాలు కావాలని కలలు కన్నారు. ఆ కలను సాకారం చేసుకునే క్రమంలో 2018లో హైదరాబాద్‌లోని మల్లా రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ నుంచి ఎంబీబీఎస్ పూర్తిచేశారు. అక్కడే ఆమె జీవితం అనూహ్య మలుపు తిరిగింది. ఎంబీబీఎస్ చదువుతున్న సమయంలోనే తన ఉనికిని చాటుకుంటూ ట్రాన్స్‌జెండర్‌గా బయటకు వచ్చారు. దీంతో దాదాపు ఆరేళ్ల పాటు కుటుంబానికి దూరమయ్యారు. ఒకవైపు మానసిక వేదన, మరోవైపు ఆర్థిక ఇబ్బందులు ఆమెను చుట్టుముట్టాయి. "కొన్నిసార్లు తినడానికి తిండి కూడా ఉండేది కాదు" అని ఆమె ఆనాటి కఠిన పరిస్థితులను గుర్తు చేసుకున్నారు. ఎంబీబీఎస్ పూర్తయ్యాక, లింగ గుర్తింపు కారణంగా హైదరాబాద్‌లోని 15కు పైగా ప్రైవేట్ ఆసుపత్రులు ఆమెకు ఉద్యోగం నిరాకరించాయి. అయినా ఆమె కుంగిపోలేదు. మిత్ర్ క్లినిక్‌లో వైద్యురాలిగా చేరి, ఆ తర్వాత 2022లో ఉస్మానియా జనరల్ ఆసుపత్రిలో మెడికల్ ఆఫీసర్‌గా ప్రభుత్వ ఉద్యోగం సాధించారు. తెలంగాణ ప్రభుత్వ సేవలో చేరిన తొలి తరం ట్రాన్స్‌జెండర్ వైద్యుల్లో ఒకరిగా నిలిచారు. ఆమె పోరాటం అక్కడితో ఆగలేదు. పీజీ ప్రవేశాల్లో ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక రిజర్వేషన్ కోసం తెలంగాణ హైకోర్టులో న్యాయపోరాటం చేశారు. కోర్టు ఆదేశాలతో 2023లో హైదరాబాద్‌లోని ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీలో ఎమర్జెన్సీ మెడిసిన్‌లో ఎండీ సీటు సాధించారు. అలా ట్రాన్స్‌జెండర్ కోటాలో పీజీ సీటు పొందిన దేశంలోని తొలి వైద్యురాలిగా మరో రికార్డు సృష్టించారు. తాజాగా విడుదలైన ఎండీ ఫైనల్ ఇయర్ పరీక్షల ఫలితాల్లో అన్ని సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత సాధించి, తన కలను సాకారం చేసుకున్నారు. ప్రస్తుతం ఆమె అదే ఈఎస్ఐ హాస్పిటల్‌లో సీనియర్ రెసిడెంట్‌గా సేవలు



అందిస్తున్నారు. "ఇది నా సమాజానికి, నాకు గర్వకారణమైన క్షణం. ఎన్నో అవమానాలు, కష్టాలను ఎదుర్కొని ఈ లక్ష్యాన్ని చేరుకున్నాను" అని డాక్టర్ రూత్ ఆనందం వ్యక్తం చేశారు. తన విజయం తనలాంటి ఎందరికో స్ఫూర్తినివ్వాలని ఆకాంక్షిస్తూ, తన కేసు ఫైళ్లను ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే ఇతర ట్రాన్స్‌జెండర్లతో పంచుకుంటూ వారికి మార్గనిర్దేశం చేస్తున్నారు. ఆమె జీవితం, పట్టుదల నేటి యువతకు ఒక స్ఫూర్తి దీపిక.

# దామరచర్లలో గుంజకు కట్టి కొట్టినా తప్పులేదు: కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు

**యాద్రి ప్లాంట్‌తో లక్ష కోట్ల అవినీతికి కేసీఆర్ ప్లాన్ చేశారని ఆరోపణ**
**విదేశీ బొగ్గు కోసమే దూరంగా ప్లాంట్ నిర్మాణం**
**క్షుద్రపూజలు చేసేవాళ్లు నీతులు చెబుతున్నారంటూ హరీశ్‌పై విమర్శలు**
**కేసీఆర్ కుటుంబం ఏ వ్యాపారాన్నీ వదల్లేదని ఆరోపణ**

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై, ఆయన కుటుంబంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని అడ్డం పెట్టుకుని రూ. లక్ష కోట్ల భారీ అవినీతికి కేసీఆర్ డిజైన్ చేశారని సంచలన ఆరోపణలు చేశారు. ఈ కుంభకోణానికి సూత్రధారి ప్రతిమా శ్రీనివాస్ అని ఆరోపించారు. ప్రపంచంలో ఎక్కడైనా ముడిసరుకు లభించే ప్రాంతంలోనే పరిశ్రమలు స్థాపిస్తారని, కానీ కేసీఆర్ ప్రభుత్వం బొగ్గు లభించే చోట కాకుండా కృష్ణా నదీ పరీవాహక ప్రాంతమైన దామరచర్లలో యాదాద్రి ప్లాంట్‌ను నిర్మించిందని విమర్శించారు. దీనివల్ల రూ.28 వేల కోట్లతో పూర్తి కావాల్సిన ప్రాజెక్టు వ్యయం రూ.37,800 కోట్లకు పెరిగిందని, అంటే అదనంగా రూ.9,800 కోట్లు భారం పడిందని వివరించారు. 40 ఏళ్లలో రూ. లక్ష కోట్ల అవినీతి కోసమే ఈ ప్లాంట్‌ను కేసీఆర్ డిజైన్ చేశారని రేవంత్ ఆరోపించారు. ఈ ప్రాజెక్టును గ్రేడ్–9 బొగ్గుతో నడిచేలా రూపొందించి, ఏటా 14 మిలియన్ టన్నుల బొగ్గును విదేశాల నుంచి దిగుమతి చేసుకునేలా ప్రణాళిక వేశారని మండిపడ్డారు. ఇంత పెద్ద అవినీతికి పాల్పడిన కేసీఆర్‌ను, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని దామరచర్లలో గుంజకు కట్టేసి కొట్టినా తప్పులేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వచ్చాకే ఒడిస్సాలోని నైనీ గని నుంచి బొగ్గు తెచ్చి రైతులకు విద్యుత్ ఇస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ నేత హరీశ్‌రావుపై కూడా రేవంత్ ఘాటుగా స్పందించారు. "క్షుద్రపూజలు చేసేవాళ్లు కూడా నీతులు చెబితే తెలంగాణ ప్రజలు ఎలా నమ్ముతారు? మంత్రగాళ్లు, నేరగాళ్లను నమ్మాల్సిన పని లేదు" అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ కుటుంబం ఇసుక, బొగ్గు, భూములు, డ్రగ్స్, గంజాయి, కొకైన్ ఇలా దేన్నీ



వదల్లేదని ఆరోపించారు. ఆంధ్రాలోని కాలేజీలు, ఆసుపత్రులకు పాలు సరఫరా చేసే వ్యాపారం హరీశ్‌రావు చూసుకుంటే, విదేశీ విస్కీ వ్యాపారాన్ని సంతోష్ రావు ఏర్పాటు చేసుకున్నారని ఆరోపించారు. జూబ్లీహిల్స్‌లో 'టానిక్' పేరుతో ప్రత్యేక పర్మిషన్‌తో వ్యాపారం నడుపుతున్నారని, దేశంలో ఇలాంటి అనుమతి ఉన్నది అదొక్కటేనని రేవంత్ రెడ్డి విమర్శించారు.

# రూ.15 బియ్యం.. రూ.100కు అమ్మకం.. రేషన్ బియ్యం రీసైక్లింగ్ దందా బట్టబయలు!

మంగ ల్పల్లి, పటేల్గూడ, బొంగుళూరు, శేరిగూడ, తుక్కుగూడ, మహేశ్వరం, ఆమనగల్లు, ఉప్పరి గూడ, పోచారం, ఎలిమినేడు, శంషాబాద్, కోహెడ, యాచారం, మంచాల, మొయినాబాద్,చేవెళ్ల వంటి ప్రాంతాల్లో పెద్ద ఎత్తున రైస్ మిల్లులు న్నాయి. మిల్లుల నిర్వాహకులు గ్రామాల వారీగా తమ ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని వారి ద్వారా ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేస్తున్న బియ్యాన్ని కిలోకు రూ. 15–రూ. 20 వరకు కొను గోలు చేసి.. వాటిని మిల్లుల్లో రీసైక్లింగ్ చేసి మార్కె ట్లో కిలో వంద రూపాయల చొప్పున విక్రయిస్తూ లక్షలాది రూపాయలను ఆర్జిస్తున్నారు. ఈ దందా కొంతకాలంగా శివారు రైస్ మిల్లులో యథేచ్ఛగా సాగుతున్నది. రేషన్ బియ్యం దందాపై గత మూడు నెలల్లో జిల్లాలో 120 వరకు కేసులు నమోదయ్యా యి. మరోవైపు ఎల్నినో ప్రభావంతో వరి దిగుబడి కూడా గణనీయంగా తగ్గిపోతున్న నేపథ్యంలో మిల్లర్లు పెద్ద ఎత్తున సివిల్సప్లయ్ బియ్యాన్ని కొని రీసైక్లింగ్ చేసి పలు గోదాముల్లో నిల్వ చేస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఈ దందాపై సివిల్ సప్లయ్, విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ శాఖల అధికారులు దృష్టి సారించకపోవ టంపై పలు విమర్శలు వెల్లువెత్తుతు న్నాయి. మరోవైపు శివారు ప్రాంతా ల్లోని రైస్ మిల్లర్లు సివిల్సప్లయ్ బియ్యంపై కోట్ల రూపాయల క్రయవిక్రయాలు జరుపుతున్నట్టు ఆరో పణలున్నాయి. తాజాగా, ఇబ్రహీంపట్నం మండ లంలోని మంగలపల్లిలోని న్యూబన్సల్ రైస్ మిల్లులో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొని రీసై క్లింగ్ చేసి 101 బస్తాల్లో ఉన్న 396 క్వింటాళ్ల బియ్యాన్ని సివిల్సప్లయ్ ఎన్ఫోర్స్మెంట్, పోలీ సులు స్వాధీనం చేసుకోవటంతో సివిల్సప్లయ్ బియ్యం దందా గుట్టురట్టయ్యింది.

**జిల్లాకు ప్రతినెలా 15 వేల మెట్రిక్ టన్నులు..**

ప్రభుత్వం ప్రతినెలా జిల్లాకు పీడీఎస్ ద్వారా 15 వేల మెట్రిక్ టన్నుల సన్నబి య్యాన్ని కేటా యిస్తున్నది. ఆ బియ్యాన్ని 6.75 లక్షల రేషన్కార్డులు కలిగిన లబ్ధిదా రులు పొందుతున్నారు. ఈ బియ్యాన్ని నిరు పేదలు సద్వినియోగం చేసుకుంటున్నా ఎక్కు వమంది బ్లాక్



మార్కెట్లో విక్రయిస్తున్నారు. కొందరు రైసిమిల్లుల నిర్వాహకులు ఏజెం ట్లను నియమించి గ్రామాల వారీగా ఆ బియ్యాన్ని కిలోకు రూ.15 నుంచి రూ.20 వరకు చెల్లించి కొనుగోలు చేయిస్తున్నారు. బియ్యాన్ని రీ సైక్లింగ్ చేసిన అనంతరం రూ.100కు కిలో చొప్పున విక్రయిస్తున్నారు. ఆటోల ద్వారా ఇంటింటికీ తిరిగి ఆ బియ్యాన్ని సేకరించి రైసిమిల్లర్లకు విక్రయిస్తు న్నారు. దీంతో ప్రభుత్వం పీడీఎస్ బియ్యం రైస్ మిల్లర్లకు వరంగా మారింది. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలి స్తున్న వ్యక్తులపై గత మూడు నెలల్లో 120 కేసులు నమోదయ్యాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో సేకరించిన బియ్యాన్ని రైస్ మిల్లు లకు తరలిస్తుండగా పట్టుబడిన వారే అధి కంగా ఉన్నారు. జిల్లాలో నెలకు 10 –15 కేసులు పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తర లిస్తున్న వారిపై కేసులు నమోదవుతున్నాయి. వారిపై నామమాత్రంగా కేసులు నమోదు చేస్తుండటంతో వెంటనే బయటికి వస్తున్నా రు. బియ్యం సీజ్ అయినా మళ్లీ ఈ వ్యాపా రాన్నే ఎంచుకుని యథేచ్ఛగా సాగిస్తున్నారు. ప్రభుత్వం తెల్లరేషన్కార్డులు కలిగిన వారికి ఉచితంగా సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తుండగా.. ఆ రైస్ పక్కదారి పడుతున్నా సివిల్సప్లయ్ ఎన్ఫోర్స్మెంట్, పోలీస్, సివి ల్సప్లయ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరి స్తున్నారన్న ఆరోపణలున్నాయి.

**396 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత...**

ఆదిబట్ల, అక్టోబర్ 23 : మంగలపల్లి గ్రామంలోని న్యూబన్సల్ రైస్ । మిల్లులో సివిల్సరఫరా శాఖ అధికారులు శుక్రవారం దాడులు చేసి 396 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. అనంతరం ఆ రైస్ ను ఇబ్రహీంపట్నం గోదాంకు తరలించి ఆదిబట్ల పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ మిల్లులో గతంలో 250 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుపడినట్టు సమాచారం. ఈ దందాలో సిద్దిపేట జిల్లా భూంపల్లి మండలం, మోతెలోని భారతి ఇండస్ట్రీస్ పేరు తెరపైకి వచ్చింది. అక్కడి నుంచే బియ్యాన్ని కొన్నట్టు న్యూబన్సల్ రైస్ మిల్లు నిర్వాహకులు చెప్పినట్టు తెలుస్తున్నది. కాగా, భారతి ఇండస్ట్రీస్ నుంచి న్యూబన్సల్ రైసి లుతోపాటు మరో రెండు మిల్లులకూ రేషన్ బియ్యం సరఫరా జరి గినట్టు ఆరోపణలున్నాయి. ఆ రైస్మిల్లుల పేర్లు పోలీసుల దర్యా ప్తులో వెల్లడి కానున్నది.



# ముగ్గురు ఐపీఎస్‌లను తొలగించండి..

**రాష్ట్రపతికి వైసీపీ ఎంపీ గురుమూర్తి లేఖ**

**అధికారులు పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని లేఖలో ఆరోపణ**

**స్థానిక ఎన్నికల నామినేషన్ల ఘర్షణల నేపథ్యంలో పరిణామం**

ఆంధ్రప్రదేశ్‌లో ముగ్గురు సీనియర్ ఐపీఎస్ అధికారులను ఎన్నికల విధుల నుంచి తక్షణమే తొలగించాలని కోరుతూ వైసీపీ ఎంపీ గురుమూర్తి రాష్ట్రపతి, భారత ప్రధాన న్యాయమూర్తి, రాష్ట్ర గవర్నర్, రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారి సహా పలువురు ఉన్నతాధికారులకు లేఖ రాశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ అధికారులు పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని ఆయన తన లేఖలో తీవ్ర ఆరోపణలు చేశారు. డీఐజీ కోయ ప్రవీణ్, అన్నమయ్య ఎస్పీ ధీరజ్ కనుబిల్లి, కడప ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్‌లను ఎన్నికల విధుల నుంచి తప్పించాలని ఎంపీ గురుమూర్తి డిమాండ్ చేశారు. 2019 ఎన్నికల సమయంలోనూ డీఐజీ కోయ ప్రవీణ్‌పై పక్షపాత ఆరోపణలు రావడంతో ఎన్నికల సంఘం ఆయన్ను విధుల నుంచి తొలగించిందని, అలాంటి అధికారిని మళ్లీ నియమించడం నిబంధనలకు విరుద్ధమని గుర్తుచేశారు. స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో పుంగనూరు, పులివెందుల, కమలాపురం, బద్వేల్ వంటి ప్రాంతాల్లో వైసీపీ అభ్యర్థులపై దాడులు జరిగాయని, వారిని అడ్డుకున్నారని గురుమూర్తి ఆరోపించారు. ముఖ్యంగా పుంగనూరులో తమ పార్టీ ఒక్క నామినేషన్ కూడా దాఖలు చేయలేకపోయిందని పేర్కొన్నారు. పోలీసుల పక్షపాత వైఖరి, పర్యవేక్షణ లోపాలపై స్వతంత్ర విచారణ జరిపించాలని, అభ్యర్థులకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించాలని ఆయన తన లేఖలో కోరారు.

# అరబిందో ఫార్మాలో అగ్నిప్రమాదం.. పరుగులు తీసిన కార్మికులు

**అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మాసిటీలో ఘటన**

**అరబిందో ఫార్మా యూనిట్-15లో చెలరేగిన మంటలు**

**షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగిందని ప్రాథమిక అంచనా**

**పరిస్థితిపై హోంమంత్రి అనిత ఆరా, సహాయక చర్యలపై ఆదేశాలు**

పరవాడ ఫార్మాసిటీలోని అరబిందో ఫార్మా కంపెనీలో శుక్రవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. తెల్లవారుజామున సుమారు 5:30 గంటల సమయంలో యూనిట్-15 ప్రొడక్షన్ బ్లాక్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో విధుల్లో ఉన్న కార్మికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ప్రమాద తీవ్రతను గమనించిన సిబ్బంది ప్రాణరక్షణ కోసం వెంటనే పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది తక్షణమే ఘటనా స్థలానికి చేరుకుని, మంటలను అదుపులోకి తీసుకురావడానికి శ్రమించారు. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అధికారులు, యాజమాన్యం ఊపిరి పీల్చుకున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ లేదా రసాయన చర్య కారణంగానే ఈ అగ్నిప్రమాదం సంభవించి ఉండవచ్చని అధికారులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలను తెలుసుకునేందుకు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత స్పందించారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఫోన్లో మాట్లాడి ప్రమాద వివరాలను, తాజా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సహాయక చర్యలను వేగవంతం చేయాలని, తక్షణమే అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆమె ఆదేశించారు.

# ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి 40 ఏళ్లు.. రూబీ జూబ్లీ వేడుకలకు ఉపరాష్ట్రపతి, గవర్నర్, చంద్రబాబు

**దేశంలోనే తొలి ఆరోగ్య విశ్వవిద్యాలయంగా గుర్తింపు పొందిన ఎన్టీఆర్ వర్సిటీ**

**40 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రూబీ జూబ్లీ వేడుకల నిర్వహణ**

**అక్టోబర్ 26న విజయవాడలో జరగనున్న ఉత్సవాలు**

**ముఖ్య అతిథులుగా భారత ఉపరాష్ట్రపతి, గవర్నర్, ముఖ్యమంత్రి హాజరు**

దేశ వైద్య విద్యారంగంలో ఒక చారిత్రక అధ్యాయాన్ని లిఖించిన డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం 40 ఏళ్ల మైలురాయిని పురస్కరించుకుని రూబీ జూబ్లీ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు సిద్ధమైంది. ఈ ప్రతిష్ఠాత్మక ఉత్సవాలకు భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. ఈ వివరాలను యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి. చంద్రశేఖర్ శుక్రవారం విజయవాడలో మీడియాకు వెల్లడించారు. దేశంలోనే మొట్టమొదటి ఆరోగ్య విశ్వవిద్యాలయంగా 1986 నవంబర్ 1న ఏర్పాటైన ఈ సంస్థ, 2026 నవంబర్ 1 నాటికి 40 వసంతాలు పూర్తి చేసుకోనుందని ఆయన తెలిపారు. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని, అక్టోబర్ 26వ తేదీ సోమవారం విజయవాడలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కళావేదికలో రూబీ జూబ్లీ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు వివరించారు. గత నాలుగు దశాబ్దాలుగా లక్షలాది మంది వైద్యులను, ఆరోగ్య నిపుణులను దేశానికి అందించిన ఘనత ఈ విశ్వవిద్యాలయానికి దక్కుతుందని వీసీ చంద్రశేఖర్ కొనియాడారు. ఈ చారిత్రక వేడుకలకు దేశంలోని ప్రముఖ వైద్యులు, పూర్వ విద్యార్థులు, ఇతర ప్రముఖులు హాజరుకానున్నారని, అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.




# జగన్ మేనమామ కాదు, కంసమామ: ఎమ్మెల్యే గళ్లా మాధవి

**o జగన్ మేనమామ కాదు.. మహిళల కన్నీళ్లకు కారణమైన కంసమామ అంటూ ఫైర్**

**o సొంత మేనకోడలి పెళ్లిని అడ్డుకుంటున్నారని గళ్లా మాధవి ఆగ్రహం**

**o అధికారం కోసం అక్కాచెల్లెమ్మలంటూ ఓట్లు వేయించుకున్నారని ఆరోపణ**

**o జగన్‌ను సమర్థిస్తున్నారంటూ పేర్ని నానిపై తీవ్ర విమర్శలు**



మాజీ ముఖ్యమంత్రి జగన్ తన సొంత కుటుంబ సభ్యుల పట్ల వ్యవహరిస్తున్న తీరు అత్యంత దారుణంగా ఉందని, ఆయన మేనమామ కాదు.. మహిళల కన్నీళ్లకు కారణమవుతున్న 'కంసమామ' అని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అధికారం కోసం 'అక్కాచెల్లెమ్మలు' అంటూ ఓట్లు వేయించుకుని, తీరా గద్దెనెక్కిన తర్వాత సొంత చెల్లిని, తల్లిని కూడా రోడ్డున పడేశారని ఆమె ఆరోపించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. జగన్ ద్వంద్వ వైఖరిని ఎండగట్టారు. "ఒక నాయకుడి వ్యక్తిత్వం ఆయన మాటల్లో కాదు, చేతల్లో కనిపిస్తుంది. సొంత చెల్లెలు షర్మిల తన కుమార్తె వివాహానికి శుభలేఖలు పంచుతుంటే, ఆ వివాహం జరగకుండా అడ్డుకునేందుకు కన్నతల్లితోనే రాయబారాలు నడపడం జగన్ వికృత మనస్తత్వానికి నిదర్శనం. ఎన్నికల ముందు 'నేను మీ జగన్ మామను' అని చెప్పుకున్న వ్యక్తి, ఇప్పుడు సొంత మేనకోడలి పెళ్లిని అడ్డుకోవడం ఎంతవరకు సమంజసం? ఇది మేనమామ లక్షణం కాదు, కంసమామ వైఖరి" అని గళ్లా మాధవి మండిపడ్డారు. గతంలో జగన్ జైలులో ఉన్నప్పుడు పార్టీని నిలబెట్టేందుకు వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసిన షర్మిలను, అండగా నిలిచిన తల్లి విజయమ్మను అధికారం రాగానే అవమానించి బయటకు పంపారని ఆమె ఆరోపించారు. "ఆస్తిలో ఆడబిడ్డలకు సమాన హక్కు కల్పించిన ఎన్టీఆర్ వంటి మహనీయులు ఏలిన గడ్డ ఇది. అలాంటి చోట సొంత చెల్లికి దక్కాల్సిన హక్కులను కాలరాస్తూ, మహిళా సాధికారత గురించి జగన్ మాట్లాడటం హాస్యాస్పదం" అని విమర్శించారు. జగన్ చర్యలను వైసీపీ నేత పేర్ని నాని సమర్థిస్తున్నారంటూ గళ్లా మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు. "గతంలో ప్రజలను కలవకుండా పరదాలు కట్టుకుని తిరిగిన జగన్‌కు, ఇప్పుడు మేనకోడలి పెళ్లికి అపరిచితులు వస్తారంటూ భద్రతా కారణాలు గుర్తుకొచ్చాయా? తప్పును సమర్థిస్తే రేపు సొంత కుటుంబంలోనే పేర్ని నానికి గౌరవం దక్కదు" అని ఆమె హెచ్చరించారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం కుటుంబాలను కలుపుతూ రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తుంటే, జగన్ మాత్రం "విభజించు-పాలించు" అనే సిద్ధాంతంతో సొంత కుటుంబాన్నే ముక్కలు చేస్తున్నారని ఆమె విమర్శించారు. తన కుటుంబంలోని ఆడబిడ్డలకే కనీస గౌరవం ఇవ్వలేని జగన్‌కు 'మామ', 'అన్న' అని పిలిపించుకునే నైతిక హక్కు లేదని గళ్లా మాధవి స్పష్టం చేశారు.

# సాయికృష్ణ డెత్ కేసు: రంగంలోకి సీబీఐ.. విజయవాడలో దర్యాప్తు ప్రారంభం

**o సాయికృష్ణ లాకప్ డెత్ కేసు దర్యాప్తును అధికారికంగా చేపట్టిన సీబీఐ**

**o విజయవాడకు చేరుకుని ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సీబీఐ ప్రత్యేక బృందం**

**o ఇప్పటివరకు దర్యాప్తు చేసిన సిట్ నుంచి రికార్డులను స్వాధీనం చేసుకున్న అధికారులు**

**o హైకోర్టు ఆదేశాలతో కేసు బదిలీ, మృతుడి తల్లికి రూ.25 లక్షల పరిహారం**

**o పోలీసులే కొట్టి చంపి, రహస్యంగా దహనం చేశారని ఇటీవల తేల్చిన సిట్**



ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన గాదె సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసు దర్యాప్తును కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) అధికారికంగా చేపట్టింది. హైకోర్టు ఆదేశాల మేరకు, సీబీఐ అడిషనల్ ఎస్పీ నేతృత్వంలోని ప్రత్యేక బృందం శుక్రవారం విజయవాడకు చేరుకుంది. ఈ కేసుకు సంబంధించి సీబీఐ ప్రత్యేక కోర్టులో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, దర్యాప్తు ప్రక్రియను వేగవంతం చేసింది. ఇప్పటివరకు ఈ కేసును విచారించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నుంచి కీలకమైన రికార్డులు, ఆధారాలను సీబీఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణలో భాగంగా సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి సమక్షంలో కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో సీన్ రీ-కన్‌స్ట్రక్షన్ చేసేందుకు సీబీఐ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ దర్యాప్తుపై హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసి, నిష్పక్షపాత విచారణ కోసం కేసును సీబీఐకి అప్పగించిన విషయం తెలిసిందే. అంతేకాకుండా, బాధితురాలి తల్లికి నాలుగు వారాల్లోగా రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని కూడా ప్రభుత్వాన్ని ఆదేశించింది.

**అసలేం జరిగింది?**

విజయవాడ రాణిగారి తోట ప్రాంతానికి చెందిన గాదె సాయికృష్ణ (25) పై ఉన్న రెండు నాన్-బెయిలబుల్ వారెంట్ల అమలు పేరుతో ఈ ఏడాది మే 5వ తేదీ అర్ధరాత్రి మార్కాపురంలో టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడిని కృష్ణలంక పీఎస్ లో అప్పగించారు. అయితే, అతడిని 24 గంటల్లో కోర్టులో హాజరుపరచకుండా అక్రమంగా నిర్బంధించారు. ఈ క్రమంలో తన కుమారుడి ఆచూకీ లేదంటూ తల్లి విజయలక్ష్మి హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. కోర్టు ఆదేశాలతో రంగంలోకి దిగిన సిట్, తన దర్యాప్తులో విస్తుపోయే నిజాలను వెలుగులోకి తెచ్చింది. కృష్ణలంక సీఐ ఎస్.ఎస్.వి.వి. నాగరాజు, ఇతర సిబ్బంది సాయికృష్ణను ఓ పాత భవనంలో నిర్బంధించి తీవ్రంగా కొట్టడంతో మే 12న మరణించాడని తెలిపింది. ఆ తర్వాత శవాన్ని రహస్యంగా స్వర్గపురి శ్మశానవాటికలో దహనం చేశారని సిట్ తన రిమాండ్ రిపోర్ట్‌లో పేర్కొంది. సాక్ష్యాలను మాయం చేసేందుకు సీసీటీవీ హార్డ్ డిస్క్‌లను మార్చడం, సాయికృష్ణ గోవా వెళ్లాడని నమ్మించేందుకు అతని ఫోన్‌ను వేరే వ్యక్తికి ఇచ్చి పంపడం వంటి చర్యలకు పాల్పడినట్లు తేలింది. ఈ కేసులో సీఐ నాగరాజుతో పాటు పలువురిని సిట్ అరెస్ట్ చేసింది. ప్రస్తుతం సిట్ దర్యాప్తు ముగిసి, సీబీఐ రంగప్రవేశం చేయడంతో ఈ కేసు మరో కీలక దశకు చేరుకుంది. సీబీఐ విచారణలో మరిన్ని వాస్తవాలు, బాధ్యులైన అధికారుల పూర్తి వివరాలు బయటకు వస్తాయని బాధితురాలి కుటుంబం ఆశిస్తోంది.

# జోగి రమేశ కోడలు ప్రయాణిస్తున్న కారును ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు.. హత్యాయత్నంగా అనుమానం

**మాజీ మంత్రి జోగి రమేశ్ కోడలిపై తండ్రి సంచలన ఫిర్యాదు**

**కారు ప్రమాదం వెనుక జోగి హస్తం ఉందని అనుమానం**

**వరకట్న వేధింపుల కేసు నేపథ్యంలోనే ఈ ఘటన జరిగిందని ఆరోపణ**

**ఇది ప్రమాదమేనని స్పష్టం చేసిన పోలీసులు**

**ఇప్పటికే జోగి రమేశ్ కుటుంబంపై గృహహింస, హత్యాయత్నం కేసు**



మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత జోగి రమేశ్ కుటుంబ వివాదం మరో కీలక మలుపు తిరిగింది. తన కుమార్తె మేఘనతో కలిసి ప్రయాణిస్తుండగా జరిగిన కారు ప్రమాదంపై ఆమె తండ్రి కృష్ణ అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ ప్రమాదం వెనుక జోగి రమేశ్ హస్తం ఉండొచ్చని ఆరోపిస్తూ ఆయన పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.ఐఅక్టోబర్ 15న జోగి రమేశ్ కోడలు మేఘన, ఆమె తండ్రి కృష్ణ విజయవాడ నుంచి తెలంగాణలోని కోదాడకు కారులో బయలుదేరారు. ఈ క్రమంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు వీరి కారును ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు పాక్షికంగా దెబ్బతింది. అయితే, ఇది సాధారణ ప్రమాదం కాదని, తమను లక్ష్యంగా చేసుకుని జరిపిన దాడిగా కృష్ణ భావిస్తున్నారు. ఈ మేరకు అక్టోబర్ 16న ఆయన ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమకు ప్రాణహాని ఉందని, ఈ ప్రమాదం వెనుక జోగి రమేశ్ హస్తం ఉండే అవకాశం ఉందని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. బస్సు డ్రైవర్‌పై చర్యలు తీసుకోవడంతో పాటు, ఈ ఘటనపై లోతుగా దర్యాప్తు జరపాలని పోలీసులను కోరారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే, ప్రాథమికంగా ఇది ప్రమాదమేనని, ఉద్దేశపూర్వకంగా జరిగినట్లు ఆధారాలు లేవని పోలీసులు తెలిపినట్లు సమాచారం. జోగి రమేశ్ కుటుంబంపై ఆయన కోడలు మేఘన గతంలోనే సంచలన ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. వరకట్న వేధింపులు, గృహహింస, హత్యాయత్నం వంటి తీవ్రమైన ఆరోపణలతో ఈ ఏడాది జులైలో తన భర్త జోగి రాజీవ్, మామ జోగి రమేశ్, అత్త శకుంతల సహా 11 మందిపై ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు ఎఫ్ఐఆర్ (326/2026) నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. 2025 మేలో జరిగిన తమ వివాహానికి తన తల్లిదండ్రులు సుమారు రూ.5 కోట్లు ఖర్చు చేశారని, అయినప్పటికీ అదనంగా మరో రూ.5 కోట్లు, కారు, నగలు తీసుకురావాలంటూ వేధించారని మేఘన తన ఫిర్యాదులో ఆరోపించారు. గోవా, ఘట్‌కేసర్ వంటి ప్రాంతాల్లో తనపై హత్యాయత్నాలు కూడా జరిగాయని ఆమె పేర్కొన్నారు. తనకు రక్షణ కల్పించాలని కోరుతూ ఆమె గవర్నర్, మహిళా కమిషన్‌ను కూడా ఆశ్రయించారు. ఈ ఆరోపణలను జోగి రమేశ్ కుటుంబం మొదటి నుంచి ఖండిస్తోంది. ఇదంతా తమపై జరుగుతున్న రాజకీయ కుట్ర అని వారు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం పాత కేసుతో పాటు, ఈ కొత్త ప్రమాదం కేసుపైనా పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## ఈ సారి అలా చేస్తే సహించను
# కంటెస్టెంట్లకు వార్నింగ్



బుల్లితెర రియాలిటీ షో బిగ్‌బాస్ షోకు అంతా రెడీ అవుతోంది. ఇప్పటికే హిందీ బిగ్‌బాస్ తేదీని కూడా రివీల్ చేశారు. ఇటీవలే ప్రోమో రిలీజ్ చేసి సెప్టెంబర్ 6 నుంచి ప్రారంభం కానుందని ప్రకటింటచారు. దీంతో టాలీవుడ్ అభిమానులు సైతం తెలుగు సీజన్-10 ఎప్పుడా అని ప్రకటన కోసం ఎదురు చూస్తున్నారు. ఈ సందర్భంగా హోస్ట్ నాగార్జున పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. బిగ్‌బాస్ సీజన్-10 ప్రోమో షూటింగ్ ఇటీవలే పూర్తయిందని నాగ్ వెల్లడించారు. ఈ సారి పదో సీజన్‌కు హోస్ట్‌గా వ్యవహరించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ సీజన్ మరింత ఉన్నతంగా ప్లాన్ చేస్తున్నారని.. గతం కంటే ఆసక్తికరంగా ఉంటుందని తెలిపారు. ఇతరుల ప్రవర్తనను నిర్ణయించడం, సూచనలు చేయడం నాకిష్టం ఉండదన్నారు. అందుకే మొదటి రెండు సీజన్లలో కాస్తా ఇబ్బంది పడ్డానని.. ఆ తర్వాత షో ఫార్మాట్ అలవాటైందని వెల్లడించారు. గత సీజన్ సూపర్ హిట్ కావడంతో ఈసారి ఫిజికల్ టాస్కులు మరింత కఠినంగా ఉండబోతున్నాయని హింట్ ఇచ్చారు. అంతే కాకుండా ఈ రియాలిటీ షోలో కంటెస్టెంట్లు హద్దులు దాటి ప్రవర్తిస్తే అస్సలు సహించనని నాగ్ స్పష్టం చేశారు.



## ‘కాష్మోరా’ మ్యాజిక్ రిపీట్.. కార్తీ నయనతార కాంబోలో భారీ చిత్రం!



కొన్ని కాంబినేషన్లు మొదటి నుంచి ఆసక్తిని క్రియేట్ చేస్తాయి. చిత్రాలకు హైప్ తీసుకొస్తాయి. అలా తాజాగా నటుడు కార్తీ హీరోగా నటించడానికి సిద్ధం అవుతున్న చిత్రం ఫేమ్ థింగ్ స్పెషల్‌గా మారుతోంది. ఈయన ప్రస్తుతం నటిస్తున్న చిత్రాల్లో సర్దార్--2 ఒకటి . కార్తీ తండ్రి కొడుకులుగా ద్విపాత్రాభినయం చేసిన ఈ చిత్రం త్వరలో తెరపైకి రావడానికి ముస్తాబు అవుతోంది. దీంతో పాటూ మార్షల్ చిత్రం షూటింగ్ దశలో ఉంది. అంతేకాకుండా మరో మూడు చిత్రాలు కమిట్ అయ్యారు. అందులో తెలుగు చిత్రం హిట్ --3 కూడా ఉంది. కాగా తాజాగా మోహన్ రాజా దర్శకత్వం ఒక చిత్రం చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రిన్స్ పిక్చర్స్ పతాకంపై ఎస్.లక్ష్మణన్ నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రం గురించే కోలీవుడ్లో పెద్ద చర్చ జరుగుతోంది. ముఖ్యంగా ఈ చిత్రంలో నటించే కథానాయకి ఎవరన్న విషయంలో తాజాగా నటి నయనతార పేరు వెలుగులోకి వచ్చింది. 40 వసంతాలు దాటినా అగ్ర కథానాయికిగా రాణిస్తున్న ఈ పాన్ ఇండియా భామను అటు ఉత్తరాది, ఇటు దక్షిణాదిలోనూ భారీ అవకాశాలు వెతుక్కుంటూ వస్తున్నాయి. హిందీలో ప్రస్తుతం సల్మాన్ ఖాన్‌కు జంటగా ఒక చిత్రం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రం కోసం ఆమె ఒక తెలుగు చిత్రాన్ని వదులు కున్నట్లు ప్రచారం జరిగింది. కాగా తమిళంలో నటిస్తున్న మూకుత్తి అమ్మన్-- 2 చిత్రం త్వరలో తెరపైకి రావడానికి సిద్ధమవుతోంది. ఇవి కాక రాకాయి, మన్నాంగట్టి, మలయాళ చిత్రం డియర్ స్టూడెంట్ చిత్రాలు నిర్మాణంలో ఉన్నాయి. అదే విధంగా కవిన్‌కు జంటగా నటిస్తున్న హాయ్ చిత్రం షూటింగ్ ను పూర్తి చేసుకుని నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుకుంటోంది. ఇక యష్‌తో కలిసి నటించిన టాక్సిక్ చిత్రం త్వరలో విడుదలకు సిద్ధం అవుతోంది. విశేషం ఏమిటంటే ఇందులో ఈమె ప్రతినాయకిగా నటించినట్లు సమాచారం. ఇకపోతే కార్తీతో కలిసి ఇంతకు ముందు కాష్మోరా చిత్రంలో నటించిన నయనతార ఇప్పుడు మరోసారి ఆయనతో జత కట్టడానికి సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. దీంతో ఇంకా షూటింగ్ ప్రారంభం కాక ముందే ఈ చిత్రంపై ఆసక్తి నెలకుంటోంది.



# డిసెంబరులో రిలీజ్?

‘తండేల్’ వంటి బ్లాక్‌బస్టర్ సినిమా తర్వాత నాగచైతన్య హీరోగా నటిస్తున్న తాజా చిత్రం ‘వృషకర్మ’. ఈ సినిమాలో మీనాక్షీ చౌదరి హీరోయిన్‌గా నటిస్తుండగా, ‘లాపతా లేడీస్’ మూవీ ఫేమ్ స్పర్శ్ శ్రీవాస్తవ విలన్‌గా నటిస్తున్నారు. ‘విరూపాక్ష’ చిత్రంతో సూపర్ హిట్ అందుకున్న కార్తీక్ వర్మ దండు దర్శకత్వం వహిస్తున్నారు. బాపినీడు సమర్పణలో శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర, సుకుమార్ రైటింగ్స్‌పై బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ .బి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమా డిసెంబరులో ప్రేక్షకుల ముందుకు రానుందనే టాక్ వినిపిస్తోంది. పౌరాణిక నేపథ్యం, థ్రిల్లింగ్ కథనంతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో తన పాత్ర కోసం నాగచైతన్య ఫిజికల్‌గా కొత్తగా ట్రాన్స్‌ఫార్మ్ అయ్యారు. ఈ విషయాన్ని మార్చి 5న విడుదలైన గ్లింప్స్ స్పష్టం చేసింది. తన కెరీర్‌లో పూర్తిగా భిన్నమైన కథను ఎంచుకుని ‘వృష కర్మ’తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు చైతన్య. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ వేగంగా కొనసాగుతోంది. అయితే ఈ సినిమా విడుదల తేదీపై చిత్రయూనిట్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రానప్పటికీ డిసెంబరులో ప్రేక్షకుల ముందుకు రానుందనే వార్త ప్రచారంలోకి వచ్చింది. కాగా ఈ చిత్రానికి అజనీష్ బి. లోక్‌నాథ్ సంగీతం అందిస్తుండగా, రాగుల్ డి. హెరియన్ కెమెరామేన్‌గా వ్యవహరిస్తున్నారు.

## భావోద్వేగాల స్పిరిట్

ప్రభాస్ హీరోగా నటిస్తున్న తాజా పాన్ ఇండియన్ మూవీ ‘స్పిరిట్’. ‘అర్జున్ రెడ్డి, కబీర్ సింగ్, యానిమల్’ చిత్రాల ఫేమ్ సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో ‘యానిమల్’ మూవీ ఫేమ్ తృప్తీ దిమ్రీ హీరోయిన్‌గా నటిస్తుండగా, ప్రకాష్‌రాజ్, వివేక్ ఒబెరాయ్, కాంచన కీలక పాత్రలు పోషిస్తున్నారు. భద్రకాళి పిక్చర్స్ ప్రొడక్షన్స్, టీ--సిరీస్ బ్యానర్స్‌పై ప్రణయ్ రెడ్డి వంగా, భూషణ్ కుమార్, కృష్ణన్ కుమార్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో ప్రభాస్ తొలిసారి పోలీసాఫీసర్ పాత్రలో నటిస్తున్న సంగతి తెలిసిందే. పోలీస్ అనగానే పవర్‌ఫుల్ యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ చిత్రం సాగుతుందని అనుకుంటారు. అయితే ఈ సినిమాలో భావోద్వేగాలకు కూడా ఎంతో ప్రాధాన్యం ఉందట. ఈ విషయాన్ని చిత్ర నిర్మాతల్లో ఒకరైన భూషణ్ కుమార్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. “స్పిరిట్’ లో తన కెరీర్‌లోనే మోస్ట్ ఇంటెన్స్ క్యారెక్టర్‌లో కనిపించబోతున్నారు ప్రభాస్. తన మార్క్ యాక్షన్, ఎమోషన్స్‌తో అద్భుతమైన అనుభూతిని ఇచ్చేలా తీర్చిదిద్దుతున్నారు సందీప్. ఈ సినిమాలోని కొన్ని సన్నివేశాలను చూశాను. పోలీస్ స్టోరీ కథ అయినప్పటికీ కుటుంబ నేపథ్యం, బలమైన భావోద్వేగాలు ఉంటాయి. మునుపెన్నడూ చూడని సినిమా ఇది అని ప్రేక్షకులు భావిస్తారు” అని పేర్కొన్నారు. ఈ సినిమా తెలుగు, హిందీ, తమిళ్, మలయాళ, కన్నడతో పాటు చైనీస్, జపనీస్, కొరియన్ సహా మొత్తం 8 భాషల్లో 2027 మార్చి 5న విడుదల కానుంది.





## అది తెలియకపోవడం అవమానమే విద్యార్థులకు ధనుశ్ చురకలు

కోలీవుడ్ హీరో ధనుశ్ ఆసక్తికర కామెంట్స్ చేశారు. చెన్నైలో తన సొంత నిధులతో నిర్మించిన స్కూల్ భవనాన్ని ప్రారంభించారు. ఆ పాఠశాల పూర్వ విద్యార్థి అయిన ధనుశ్.. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. మీరంతా మాతృభాష పట్ల శ్రద్ధ చూపాలని అన్నారు. తమిళం రాకపోవడం కరెక్ట్ కాదని.. అది నిజంగా సిగ్గుచేటని విద్యార్థులకు చురకలంటించారు. ఈ సందర్భంగా ధనుష్ తన పాఠశాల రోజులను గుర్తుచేసుకున్నారు. ఇతర భాషలలో ప్రావీణ్యం సంపాదించే ముందు విద్యార్థులు మొదట తమ మాతృభాషను చదవడం, రాయడం నేర్చుకోవాలని ధనుశ్ విజ్ఞప్తి చేశారు. ధనుశ్ మాతృభాష గురించి మాట్లాడుతూ.. “ఒకరు మొదట తమ మాతృభాషను నేర్చుకోవాలి. వారు మొదట దానిని చదవడం, రాయడం నేర్చుకోవాలి. మీకు తమిళం రాదని చెప్పడం గర్వించదగిన విషయం కాదు. మీ మాతృభాష తెలియకపోవడం నిజానికి అవమానకరం. దయచేసి మీ మాతృభాషకు ప్రాధాన్యత ఇవ్వండి. దయచేసి తమిళంపై కూడా దృష్టి పెట్టండి” అని విద్యార్థులకు సూచించారు. ధనుశ్ మాట్లాడుతూ..’చిన్నప్పుడు తాను ఇంగ్లీషుతో ఇబ్బంది పడినప్పటికీ.. తమిళంలో మాత్రం ఎప్పుడూ అనర్గళంగా మాట్లాడేవాడినని గుర్తుచేసుకున్నారు.

Printed, Published And Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221,** Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com